ప్రజాశక్తి

శనివారం 30 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

వాల్తేరు డివిజన్ ఊసెత్తకుండా..

జోన్‌పై ఊగిసలాట

- రాయగడ, విజయవాడ డివిజన్లలో సర్దుబాటుపై 'వాల్తేరు' ఉద్యోగుల్లో అసంతృప్తి
- 17700 మంది ఆశలపై కూటమి నీళ్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

చారిత్రాత్మక వాల్తేరు రైల్వే డివిజన్ ఊసు లేదుగానీ విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై కేంద్ర ప్రభుత్వం ఊగిసలాట ప్రదర్శిస్తోంది. రాష్ట్రంలోని కూటమి భాగస్వాములైన తెలుగుదేశం, జనసేన, ప్రతిపక్ష వైసిపి ఈ వ్యవహారంపై నోరెత్తడం లేదు. వాల్తేరు రైల్వే డివిజన్ లేకపోతే విశాఖ, ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం జరుగుతుందన్న వాదన ఈ ప్రాంతంలో ఎప్పటి నుంచో ఉంది. వీటిపైన ప్రధాన పార్టీలు మౌనం దాల్చాయి. ఈ వ్యవహారంపై రైల్వే ఉద్యోగులు, కొంతమంది అధికారుల్లో తీవ్ర కలకలం రేగుతోంది. ఎందుకంటే ఏటా సుమారు రూ.8 వేల కోట్ల మేర ఆదాయాన్ని సరుకు రవాణా ద్వారా వాల్తేరు డివిజన్ తెస్తూ దేశంలోనే అత్యధిక ఆదాయాన్ని ఆర్జిస్తూ రికార్డులు నెలకొల్పిన విషయం తెలిసిందే. అటువంటి డివిజన్‌ను తెగ్గొట్టేసిన మోడీ కుట్రలపై రాష్ట్రంలోని ప్రధాన పార్టీలు స్పందించకపోవడం ఉద్యోగులను తీవ్ర కలవరపెడుతోంది.

జోన్ అంటూ గందరగోళం

150 ఏళ్ల చరిత్ర వాల్తేరు రైల్వే డివిజన్‌కు ఉంది. 2014లో తొలిసారి కేంద్రంలో అధికారం చేపట్టిన మోడీ నేతృత్వంలోని బిజెపి సర్కారు 2016లో వాల్తేరు డివిజన్‌ను విశాఖ నుంచి లేపేస్తున్నట్లు ప్రకటించింది. నాటి నుంచి బిజెపి మినహా సిపిఎం, ఇతర వామపక్షాలు, ప్రజా, అఖిలపక్ష కార్మిక సంఘాలు పోరాడుతున్నాయి. 2024లో కూటమి పాలకులైన టిడిపి, జనసేన చేతుల్లోకి అధికారం వచ్చాక కనీసం వాల్తేరు రైల్వే డివిజన్ ఊసు లేకుండా కొత్తగా ఏర్పాటు కాబోయే దక్షిణ కోస్తా రైల్వే జోన్‌పై ప్రకటనల పరంపర కొనసాగుతోంది. ఈ గందరగోళ శైలిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రైల్వే జోన్ ఎన్నో ఏళ్ల నాటి కళ

రైల్వే జోన్ ఏర్పాటు, అందుకోసం శంకుస్థాపనకు ప్రధాని మోడీ రావడాన్ని ఈ ప్రాంత ప్రజలు, రైల్వే ఉద్యోగులు స్వాగతిస్తున్నా 17,700 మంది మిగతా 2లో..

మీడియాతో మాట్లాడుతున్న చలసాని శ్రీనివాస్

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే..

చలసాని శ్రీనివాస్ డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలను కేంద్రం నెరవేర్చాలని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదాపై రాష్ట్ర హైకోర్టు వ్యాఖ్యలు దురదృష్టకరమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజనే కండిషనల్ విభజనని, సుప్రీంకోర్టులో తమ వాజ్యం ప్రత్యేక హోదాపై కొనసాగుతూనే ఉందని తెలిపారు. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఇంతవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అఫిడివిట్లు వేయకపోవడం బాధాకరమన్నారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హోదాతో వచ్చే రాయితీలు 2027 వరకు కొనసాగుతూనే ఉన్నాయని, అందువల్ల ఆంధ్రప్రదేశ్ విభజన హామీలు ముగిసిన ఛాప్టర్ అనేవాళ్ళు రాష్ట్ర ద్రోహులని పేర్కొన్నారు. కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం వచ్చింది కాబట్టి సమయం ఇస్తున్నామని, కచ్చితంగా కొంతకాలం ఆగి ప్రత్యక్షంగా ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గురువారం మాట్లాడిన విషయాలను చలసాని ప్రస్తావించారు. అదానీతో గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలపై శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. విద్యుత్ మిగతా 2లో..

2 నుంచి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు

వార్త 2లో..

హెచ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్‌గా గంటి వెంకటేశ్వర్లు

వార్త 2లో..

10, 11న విద్యార్థి సాంస్కృతిక కళా ప్రదర్శనలు

వార్త 2లో..

ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభం

ఆకట్టుకున్న స్టాల్స్ వార్త 8లో..

'మధ్యాహ్న భోజనం'లో నాణ్యత లోపిస్తే చర్యలు

జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బడి పిల్లలకు అందించే మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పిఎం పోషణ్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకానికి సంబంధించిన పలు అంశాలపై ఆయన అధ్యక్షతన జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో క్వాలిటీ, క్వాంటిటీలలో అధికారులు ఎటువంటి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదన్నారు. ఎంపిడిఒలు, హెడ్మాస్టర్లు, ఇతర అధికారులు తరుచూ తనిఖీలు నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. బిసి, ఎస్‌సి హాస్టళ్ల మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నదీ ? లేనిదీ ? తరచూ తనిఖీలు నిర్వహించాలన్నారు. వంట తయారు చేసే వారితో పాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. వైద్యాధికారులు స్కూల్స్‌ను తనిఖీ చేసి విద్యార్థులకు అవసరమైన ఐరన్ టాబ్లెట్స్‌తో పాటు అవసరమైన వారికి ఇతర మందులను పంపిణీ చేయాలని ఆదేశించారు. నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని డిఎం సివిల్ సప్లై అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నాణ్యమైన వెజిటబుల్స్ సేకరించాలని, మెనూ ప్రకారం మాత్రమే భోజనాన్ని తయారుచేసి పిల్లలకు అందించాలని తెలిపారు. స్టోర్ రూమ్‌లలో కుకింగ్ చేసే వస్తువులకు దగ్గరలో శానిటేషన్ వస్తువులను ఉంచరాదని తెలిపారు. కిచెన్ గార్డెన్స్‌ని పెంచాలని ఐసిడిఎస్ అధికారులను మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

జోన్‌పై ఊగిసలాట

వాల్తేరు డివిజన్ రైల్వే ఉద్యోగుల విషయంలో అస్పష్టతపై ప్రశ్నిస్తున్నారు. కొత్తగా రాయగడ డివిజన్ ఏర్పాటు కానుండడంతో పైన తెలిపిన ఉద్యోగుల్లో 7700 మందిని అటుగా సర్దుబాటు చేస్తారన్నది తెలుస్తోంది. మిగతా 10 వేల మంది పరిస్థితి అగమ్యగోచరంగా ఉందని రైల్వే ఉద్యోగ సంఘాల నాయకులు, కొంతమంది అధికారులు ఆవేదన చెందుతున్నారు. ఒకవేళ ఈ పది వేల మందిని గతంలో నిర్ణయించినట్టుగా విజయవాడ డివిజన్‌లోకి పంపాల్సి వస్తే వేరే డివిజన్ అధికారుల కింద తాము అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. వాల్తేరు రైల్వే నుంచి విజయవాడ డివిజన్ దూరం 300 కిలోమీటర్ల పైమాటే. కూటమి అధికారంలోకి వచ్చాక వీరంతా తమ వాల్తేరు రైల్వే డివిజన్ చెక్కు చెదరదన్న గంపెడాశతో ఉన్నారు. అయితే వారి ఆశలపై నీళ్ల జల్లేలా కూటమి ప్రభుత్వ తీరు ఉంది. ఇప్పటికైనా కేంద్రంలోని బిజెపితో సంప్రదించి రాష్ట్ర వనరులను కాపాడుకునే చొరవను టిడిపి, జనసేన నేతలు ప్రదర్శించాలని, వాల్తేరు డివిజన్‌ను కాపాడాలని రైల్వే డిఆర్‌ఎం కార్యాలయం, ఇతర రైలు విభాగాల ఉద్యోగులు, అధికారులు కోరుతున్నారు.

'మధ్యాహ్న భోజనం'లో నాణ్యత లోపిస్తే చర్యలు

ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేసే కోడిగుడ్లకు మొదటి వారంలో తేదీతో కూడిన నీలం రంగు స్టాంపును, రెండో వారంలో పింకు రంగు స్టాంపును, మూడో వారంలో పచ్చ రంగు స్టాంపును, నాలుగో వారంలో బ్రౌన్ కలర్ స్టాంపును వినియోగించాలన్నారు. బియ్యం, కూరగాయలు, ఇతర వస్తువులను నిలవ చేసే రూముల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. సమావేశంలో విద్యా శాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, డిఎస్‌ఒ భాస్కరరావు, డిఆర్‌డిఎ పిడి లక్ష్మీపతి, ఎఫ్‌డిఎ, ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఎపికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే..

ప్రాజెక్టులు, పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టులు సహా అన్నింటినీ ఆంధ్రప్రదేశ్ జెన్కోకు కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖపట్నం ఉక్కు కర్మాగారం విషయంలో క్యాప్టివ్ మైన్స్ కేటాయించకపోవడం, నైపుణ్యంగల వారిని ప్లాంట్‌లో నియామకం చేయకపోవడం వల్ల మొన్న రూ.300 కోట్లు నష్టం వచ్చేలా రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌లో అగ్ని ప్రమాదం జరిగిందని అక్కడి కార్మిక సంఘాలు చెబుతున్న విషయాన్ని గుర్తుచేశారు. తక్షణమే ప్లాంట్‌ను ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు. కడప ఉక్కు ఫ్యాక్టరీ ప్రభుత్వ రంగంలో వస్తే ఎన్నో ఉద్యోగాలు రావడమేకాక రిజర్వేషన్ కూడా అమలవుతుందన్నారు. దీన్ని ఎందుకు అటకెక్కించారని ప్రశ్నించారు. మాజీ విసి ప్రొఫెసర్ వి.బాలమోహన్ దాస్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం ఉద్యమిస్తున్నామన్నారు. సమావేశంలో ఆంధ్ర మేధావుల ఫోరం ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ గోలివి అప్పలనాయుడు, జివిఎల్‌ఎం.శాస్త్రి, సమితి సహాయ కార్యదర్శి కనిశెట్టి సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

స్థాయీ సంఘ సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్, సభ్యులు

జివిఎంసి స్థాయీ సంఘంలో..

పలు అభివృద్ధి పనులకు ఆమోదం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని స్థాయీ సంఘం సమావేశ మందిరంలో స్థాయీ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ స్థాయీ సంఘం సమావేశంలో 117 అంశాలను పొందుపరిచారని, వాటిని స్థాయి సంఘం సభ్యులు చర్చించిన పిదప 4 అంశాలను వాయిదా వేశామని, మిగిలిన 113 అంశాలు ఆమోదం పొందాయని అన్నారు. రాత్రి నిరాశ్రయ కేంద్రాలైన టిఎస్‌ఆర్ కాంప్లెక్స్, భీమ్ నగర్ అంశాలకు సంబంధించి స్థాయీ సంఘ సభ్యులు ఆయా నిరాశ్రయ కేంద్రాలను పరిశీలిస్తారని, ఆ రెండు అంశాలను వాయిదా వేశామని చెప్పారు. ఇంజినీరింగ్ విభాగం, ప్రజారోగ్య విభాగం అభివృద్ధి పనులు, రెవెన్యూ అంశాలకు సంబంధించిన గుత్తలు, ఉద్యోగుల సర్వీసులకు సంబంధించిన అంశాలపై చర్చించిన పిదప వాటికి సభ్యులు ఆమోదం తెలిపారని చెప్పారు.

సమావేశంలో జివిఎంసి కార్యదర్శి బి.వి.రమణ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, డిసిఆర్ ఎస్.శ్రీనివాస్, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఆదినారాయణ, 1, 3, 4 జోనల్ కమిషనర్లు ప్రేమ ప్రసన్న వాణి, కె.శివప్రసాద్, మల్లయ్య నాయుడు, యుసిడి పిడి పి.ఎమ్.సత్యవేణి, పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

2 నుంచి కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాలు

బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శోభారాణి తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వన్ టౌన్ బురుజు పేటలో ప్రసిద్ధి చెందిన శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మార్గశిర మాసోత్సవాలను డిసెంబర్ 2 నుండి 30 వరకు వైభవంగా నిర్వహించనున్నామని దేవస్థానం ఉప కమిషనర్, కార్యనిర్వహణ అధికారి కె.శోభారాణి తెలిపారు. శుక్రవారం దేవస్థానం సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ సోమవారం ఉదయం 8.40 గంటలకు తొలి పూజా కార్యక్రమాన్ని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ నిర్వహించి ఈ ఉత్సవాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సుమారు లక్ష మందికిపైగా భక్తులు పాల్గొనే ఈ ఉత్సవాల నిర్వహణపై చర్చించేందుకు కలెక్టర్ అధ్యర్యంలోని కమిటీ ఇప్పటికే సమావేశమైందని వివరించారు. డిసెంబర్ 5, 12, 19, 26 తేదీల్లో వచ్చే ప్రతి గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. డిసెంబరు 22న చతుర్వేద సభ, అర్చక సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. 23న నాదస్వర కచేరి, 26న సహస్ర ఘటాభిషేకం, మహా అన్నదానం ఉంటాయని తెలిపారు. 28న జగదాంబ సెంటర్‌లోని అంబికా బాగ్ నుంచి ఆలయం వరకు రథయాత్ర నిర్వహిస్తామన్నారు. 5వ తేదీ అర్ధరాత్రి 12.01 గంటలకు గురువారం మొదటి పూజ పంచామృత సేవ చేసి దర్శనాలు ప్రారంభిస్తామన్నారు. కనకమహాలక్ష్మికి గురువారం ప్రీతిపాత్రం కావడంతో ఆ రోజున ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. ప్రతి రోజూ 3 వేల మంది, గురువారాల్లో 50 వేల మంది వరకు వస్తారని అంచనా వేసి ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎక్కడా తొక్కిసలాటలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేకంగా క్యూలైన్లు పెడుతున్నామన్నారు. దేవస్థానం తరపున ప్రధాని రహదారి నుంచి అమ్మవారి ఆలయం వరకూ రెండు లైన్లు ఉంటాయన్నారు. ప్రధాన రహదారిపై పోలీసుల సూచన మేరకు మరిన్ని లైన్లు పెడతామన్నారు. ఏ క్యూలైన్ అయినా తప్పనిసరిగా నీడ ఉండాలని, భక్తులు ఎండలో నిల్చోకూడదని కలెక్టర్ సూచించారన్నారు. ఆ మేరకు పెండాళ్లు వేస్తున్నామన్నారు. ప్రతిరోజూ అన్నదానం ఉంటుందన్నారు. మార్గశిర ఉత్సవాల్లో రోజుకు 2 వేల మందికి, మహా అన్నదానం రోజున 20 వేల మందికి ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. మున్సిపల్ స్టేడియం, విక్టోరియా ఆస్పత్రి ఆవరణ, కొత్తరోడ్డు ఆర్చి గేటు వద్ద పార్కింగ్ సదుపాయం కల్పించామన్నారు. ఆర్టీసీ బస్సులు ఉచితంగా నడపడానికి దాతలు సాయం చేస్తున్నారని తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి భక్తులు ఉచితంగా రావచ్చునన్నారు. ఈసారి ఆనందపురం, మధురవాడల నుంచి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారని పేర్కొన్నారు. గురువారం రోజు నిర్వహించే పంచామృత సేవకు రూ.7,500, సాధారణ రోజుల్లో అయితే రూ.2,500 టిక్కెట్ పెట్టామన్నారు. ఒక టిక్కెట్‌పై దంపతులు, చిన్నపిల్లలు ఇద్దరు పాల్గొనవచ్చునన్నారు. ఉదయం 5 నుంచి 6 గంటలు, 11.30 నుంచి 12 గంటలు, సాయంత్రం 6 నుంచి 6.30 గంటల మధ్య ఈ సేవ ఉంటుందని పేర్కొన్నారు. ధర్మ దర్శనం ఉచితంగా చేసుకోవచ్చునన్నారు. విశిష్ట దర్శనం రూ.500, ప్రత్యేక దర్శనం రూ.200, శీఘ్ర దర్శనం రూ.100 టిక్కెట్లు పెట్టామన్నారు.

వీటికి రీడింగ్ రూమ్ వద్ద ఏర్పాటు చేసిన కౌంటర్లలో టిక్కెట్లు ఇస్తారని తెలిపారు. మాలధారణ భక్తులచే శాంతి హోమం 30న ఉదయం 9 గంటలకు ఉంటుందన్నారు. సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణ, దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు సిహెచ్.వెంకటరమణ, పర్యవేక్షణ అధికారులు పద్మజ, తిరుపతిరావు పాల్గొన్నారు.

హెచ్‌ఎస్‌ఎల్ డైరెక్టర్‌గా గంటి వెంకటేశ్వర్లు

వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (షిప్ బిల్డింగ్) డైరెక్టర్‌గా గంటి వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 2018 మేలో హిందుస్తాన్ షిప్ యార్డ్ లిమిటెడ్‌లో అదనపు జనరల్ మేనేజర్‌గా చేరారు. అప్పటి నుండి హెచ్‌ఎస్‌ఎల్ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. షిప్ బిల్డింగ్, సబ్ మెరైన్ రెట్రోఫిట్‌మెంట్, షిప్ రిపేర్స్ బిజినెస్ యూనిట్లలో పనిచేశారు. బిజినెస్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ హెడ్‌గా, 5 ఫ్లీట్ సపోర్ట్ షిప్‌ల నిర్మాణం కోసం హెచ్‌ఎస్‌ఎల్ అతిపెద్ద ఆర్డర్‌పై సంతకం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఐఎన్‌ఎస్ సింధువీర్, ఆస్త్రధర్ని, సుజాత, సట్లెజ్ ఇతర షిప్ రిపేర్ ప్రాజెక్టులకు నార్మల్ రీఫిట్స్ సకాలంలో పూర్తి చేయడంలో ఆయన ముఖ్య పాత్ర పోషించారు. లోనావ్లాలోని ప్రతిష్ఠాత్మక నేవల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, వెల్లింగ్టన్‌లోని డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజీ పూర్వ విద్యార్థి ఆయన ఆయన తన ఉద్యోగ కాలంలో నేవీ డాక్ యార్డ్‌లతో పాటు నేవీకి చెందిన ఫ్రంట్ లైన్ యుద్ధనౌకల్లో పనిచేశారు. హెచ్‌ఎస్‌ఎల్‌లో చేరడానికి ముందు అతను భారత నావికాదళంలో 25 సంవత్సరాలకుపైగా తన కెరీర్‌లో దేశ విదేశాలలో వివిధ ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించారు .

చంద్రబాబు విద్యుత్ ఒప్పందాల వల్ల రాష్ట్రానికి నష్టం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : చంద్రబాబు అధిక ధరలతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాల వల్ల 25 ఏళ్లలో దాదాపు రూ.87,500 కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందని వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. బీచ్ రోడ్డులోని పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి కొమ్ముకాసే కొన్ని పత్రికలు, టీవీ ఛానళ్లు పూర్తిగా ప్రజల దృష్టిని మళ్లించేందుకు తమ పార్టీ అధినేత వైయస్.జగన్‌పై అవాస్తవాలు పేలుస్తున్నాయన్నారు. నిత్యం బురద చల్లుతూ, అసత్యాలు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. సోలార్ పవర్ కాంట్రాక్టుల్లో లంచాలు తీసుకుని అదానీతో జగన్ ఒప్పందం చేసుకున్నారని తప్పుడు ప్రకటనలు చేస్తున్నారన్నారు.

10, 11న విద్యార్థి సాంస్కృతిక కళా ప్రదర్శనలు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎయు విసి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ ఆధ్వర్యాన డిసెంబర్ 10, 11 తేదీలలో నిర్వహించబోయే విద్యార్థి సాంస్కృతిక కళా ప్రదర్శనల పోస్టర్‌ను ఎయు విసి శశిభూషణరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కళా ప్రతిభను ప్రదర్శించడానికి ఇదొక మంచి వేదికని అన్నారు. అందరూ దీనిలో పాల్గొనాలని ఆకాంక్షించారు. కళ, సంగీతం, నృత్యం, వక్తృత్వం, ఇతర సాంస్కృతిక ప్రదర్శనలలో పాల్గొనడం ద్వారా తమ కళాత్మక పటిమను ప్రదర్శించే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ ఎయు కార్యదర్శి వెంకటరమణ, అధ్యక్షులు హర్షిత్ పాల్గొన్నారు.

102 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో 13 లక్షల విలువగల 102 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు విశాఖపట్నం లా అండ్ ఆర్డర్ డిసిపి 2 మేరీ ప్రశాంతి తెలిపారు. శుక్రవారం ఉదయం నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె కేసు వివరాలను వెల్లడించారు. 28వ తేదీన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు నిర్వహించగా హోండా యాక్టివాపై వెళుతున్న చెన్నయ్‌కు చెందిన సెల్విని వద్ద మూడు సంచులు లభించాయన్నారు. వాటిలో గంజాయి లభ్యమైందని తెలిపారు. తమిళనాడు రాష్ట్రంలోని మధురైకి ఈ గంజాయి తరలుతోందని చెప్పారు. ఈ కేసులో సెల్విని అరెస్టు చేశామన్నారు. ఆమె మామ లక్ష్మణ్ శేఖర్ కోసం గాలిస్తున్నామని, త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

30 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖ నగర పాలక సంస్థలో 30 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి శుక్రవారం తన కార్యాలయంలో అందించారు. చిత్తశుద్ధితో వారంతా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

విఎంఆర్‌డిఎ ఎస్‌డిసిగా దయానిధి

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి : అనకాపల్లి డిఆర్‌ఒగా పనిచేస్తున్న బి.దయానిధిని విఎంఆర్‌డిఎ భూ సేకరణ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో అన్నమయ్య జిల్లా డిఆర్‌ఒగా పనిచేసిన వైఎస్‌విజెఎల్. సత్యనారాయణ అనకాపల్లి డిఆర్‌ఒగా కొద్ది రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

అవయవదానంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : అవయవదానంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ స్థానిక ప్రభుత్వ డైట్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ సిబిఎం హైస్కూల్, గంటస్తంభం, మెయిన్‌రోడ్డు మీదుగా పాత బస్టాండ్ వరకు చేరింది. అనంతరం మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ మాట్లాడుతూ, అవయవ దానం చేయడమంటే మరణించాక కూడా జీవించడమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన బెస్ట్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అఖిల భారత శరీర, అవయవ దాతల సంఘం, సావిత్రీ భాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు చైర్ పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్ని కుమారిలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, వినోద్ బాబు, బెస్ట్ ఫ్రెండ్స్ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు పల్లా సూరిబాబు, వైస్ చైర్మన్ తుపాకుల సంతోష్‌రాజ్, కార్యదర్శి అప్పలనాయుడు, డైట్, జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భీమిలిలో అవయవదానంపై అవగాహన ర్యాలీలో విద్యార్థులు

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఆరిలోవ : అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తోటగరువు ప్రాంతానికి చెందిన గవిరెడ్డి అప్పారావు(59) గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో బ్లేడుతో కంఠం కోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఆరిలోవ ఎస్ఐ కృష్ణ ప్రాథమిక వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

గీతంలో బయోమెడికల్ పరిశోధన కేంద్రం

ప్రజాశక్తి -మధురవాడ : గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీలో శుక్రవారం బయోమెడికల్ పరిశోధన కేంద్రాన్ని గీతం ఛాన్సలర్ ప్రొఫెసర్ వీరేంద్రసింగ్ చౌహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పరిశోధకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఔషధ రంగంలో పరిశోధనలకు విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. గీతం అధ్యాపకులు బయోమెడికల్ పరిశోధన ప్రాజెక్టులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ఉపయోగించుకోవాలన్నారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మాశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్ మాట్లాడుతూ, డెవలప్‌మెంటల్ బయాలజీ, డ్రగ్ డిస్కవరీ, టాక్సికాలజిలలో పరిశోధకులు అధ్యయనాలు చేపట్టాలన్నారు. స్కూల్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజా మాట్లాడుతూ, నూతనంగా ఏర్పాటైన పరిశోధన కేంద్రంలో ప్రకృతి నుంచి సేకరించిన ఔషధ మూలకాల అధ్యయనం, మధుమేహ వ్యాధి, కేన్సర్ ఔషధాలపై అధ్యయనాలు నిర్వహిస్తామన్నారు.

పద్మనాభంలో దీపోత్సవ సందడి

ప్రజాశక్తి -పద్మనాభం : శ్రీ అనంత పద్మనాభస్వామి కొండపై దీపోత్సవం సందర్భంగా పద్మనాభంలో సందడి కనిపిస్తోంది. రోడ్డుకిరువైపులా పలు పార్టీ నాయకులు ఫ్లెక్సీలతో నింపేశారు. తుపాను నేపథ్యంలో ఈ దీపోత్సవానికి ఎటువంటి ఆటంకాలు కలుగుతాయోనని భక్తులు ఆందోళన చెందుతున్నారు. దీపోత్సవాన్ని పురస్కరించుకొని పద్మనాభంలో కొంతమంది భక్తులు ప్రసాదాలు వితరణ, ఉచిత వైద్య శిబిరాలు, పలు సాంఘిక, పౌరాణిక నాటకాలు ఏర్పాటుచేశారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని తర్లువాడ గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదు చేపట్టారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు గంటా రవితేజ హాజరై మాట్లాడారు. రూ.100 సభ్యత్వ నమోదుతో రూ.5 లక్షల ఇన్స్యూరెన్స్ వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిఆర్‌బి నాయుడు, నాయకులు తాట్రాజు అప్పారావు, బంకు రాజు, మజ్జి రమేష్‌నాయుడు, ఎర్ర పైడిరాజు పాల్గొన్నారు.

గుడి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని సిర్లపాలెం రామాలయం గుడి నిర్మాణానికి టిటిడి దేవస్థానం నిధులను మంజూరు చేయించాలని కోరుతూ భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గతంలో రూ.10 లక్షలు నిధులు ఇస్తామని చెప్పారని, వాటిని మంజూరు చేయించాలని సర్పంచ్ సిర్ల అప్పలనాయుడు, నాయకులు కోరాడ గౌరునాయుడు కోరారు.

ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -మధురవాడ : ఆంధ్రప్రదేశ్ కళింగ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన పేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందించింది. గురుగుబెల్లి ఈశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతుండటంతో సంఘం రాష్ట్ర అధ్యక్షులు సీపాన వెంకటరమణ ఆధ్వర్యాన ఆ కుటుంబానికి రూ.25వేలు చెక్కును, రూ.5 వేలు విలువచేసే నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో దుగ్గపు రాజశేఖర్, బెండి నారాయణ, కూన వీరచక్రవర్తి, కోసాల చిరంజీవి, బమ్మిడి రామారావు, నంబాల ఉషారాణి, బుడుమూరు తులసి, బొడ్డేపల్లి సంతోష్, బాగాది భాను పాల్గొన్నారు.

ఏడాకుల చెట్ల పువ్వు తొలగింపుపై హర్షం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి ముడసర్లోవ రోడ్డులో స్కిల్‌డెవలెప్‌మెంట్ నుంచి ఆరిలోవ కాలనీ వరకు డివైడర్‌లో ఉన్న ఏడాకుల చెట్ల పువ్వును ఉద్యానవన శాఖ ఆధ్వర్యాన పూర్తిగా తొలగించారు. దీనిపై ముడసర్లోవ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు

లిథియం అయాన్ బ్యాటరీల స్థానే స్వదేశీ పరిజ్ఞానం

ప్రజాశక్తి -మధురవాడ : విద్యుత్తు వాహనాలు పనిచేయాలంటే దీర్ఘకాలం మన్నే లిథియం అయాన్ బ్యాటరీల అవసరం ఉందని, వీటి కోసం అధికంగా దిగుమతులపై ఆధారపడకుండా స్వదేశీ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాల్సి ఉందని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చి సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జి అండ్ న్యూమెటీరియల్స్ (ఎఆర్‌సిఐ) మాజీ డైరక్టర్, ఐఐటి హైదరాబాద్ రీసెర్చి సలహాదారు డాక్టర్ టాటా నర్సింగరావు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ రసాయన శాస్త్ర విభాగంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 2030 సంవత్సరం నాటికి దేశంలో 30 శాతం విద్యుత్తు వాహనాలు ఉత్పత్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం అని, వీటి తయారీకి విద్యుత్తును అధికంగా నిల్వ చేసుకునే సామర్థ్యం గల లిథియం అయాన్ బ్యాటరీలు అవసరమని చెప్పారు. దేశంలో ఈ బ్యాటరీల తయారీ పరిజ్ఞానం అంతగా లేకపోవడంతో దిగుమతులపై అధికంగా ఆధారపడుతున్నామని పేర్కొన్నారు. నూతన పదార్థ విజ్ఞానాన్ని ఉపయోగించి టెస్లా కంపెనీ ఎన్ఎమ్‌సి బ్యాటరీలను రూపొందించిందని, భారతదేశ వాతావరణ పరిస్థితులకు అవి సరిపోవని నిర్ధారించినట్లు వివరించారు. భారతీయ పరిశోధకులు ప్రత్యామ్నాయ బ్యాటరీల తయారీలో విజయం సాధించారని వెల్లడించారు. భారతీయ వాతావరణ పరిస్థితులకు తగిన విధంగా ఎల్ఎఫ్‌పి బ్యాటరీల పరిజ్ఞానాన్ని హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చి సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జి అండ్ న్యూమెటీరియల్స్ (ఎఆర్‌సిఐ) లో రూపొందించి ఇటీవల పలు పరిశ్రమలకు అందజేసినట్లు పేర్కొన్నారు. త్వరలో దేశంలో తయారయ్యే విద్యుత్తు వాహనాలలో ఈ స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన బ్యాటరీలను ఉపయోగించనున్నారని తెలిపారు. బ్యాటరీల జీవిత కాలం పూర్తి అయిన అనంతరం రీసైక్లింగ్‌పై పరిశోధకులు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.వేదవతి, రసాయన శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఎన్‌విఎస్.వేణుగోపాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిఎన్.రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

డిఎన్.రాజుకు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : టిడిపి మండల అధ్యక్షులు దంతులూరి అప్పల నరసింహరాజు (బుజ్జి రాజు) జన్మదినం సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు శుక్రవారం పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆర్.తాళ్లవలసలో ఉన్న అతని నివాసంలో కలిసి పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో తాళ్లవలస ఎంపిటిసి కోరాడ రమణ, పార్టీ నాయకులు పాసి త్రినాథ్‌కుమార్, పలు గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

అపోలో ఆసుపత్రిలో లంగ్ లైఫ్ స్క్రీనింగ్

లంగ్ లైఫ్ స్క్రీనింగ్ ప్రోగామ్‌ను ప్రారంభిస్తున్న అపోలో కేన్సర్ సెంటర్ వైద్య బృందం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఊపిరితిత్తుల కేన్సర్‌ను ముందుగా గుర్తించడం కోసం భారత్‌లోనే మొట్టమొదటి లంగ్ లైఫ్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌ను ఆరిలోవ హెల్త్‌సిటీలోని ఆపోలో కేన్సర్ సెంటర్‌లో ప్రారంభించారు. ఊపిరితిత్తుల కేన్సర్‌ను ఎదుర్కోవడమే లక్ష్యంగా ఈ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నట్టు అపోలో వైద్య బృందం తెలిపింది. ఈ సందర్భంగా సీనియర్ పల్మనాలజీ కన్సల్టెంట్ డాక్టర్ కెవి.రావు, ఆంకాలజీ కన్సల్టెంట్ డాక్టర్ రాకేష్‌రెడ్డి, డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ, స్క్రీనింగ్ పరీక్షల ద్వారా వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించవచ్చన్నారు. వ్యాధి ప్రాథమిక దశలో వైద్యం ప్రారంభిస్తే రోగికి మెరుగైన చికిత్స అందించవచ్చన్నారు. లంగ్ లైఫ్ స్క్రీనింగ్ ప్రోగ్రాం ముఖ్యంగా ఊపిరితిత్తుల కేన్సర్ ప్రమాదం ఎక్కువగా ఉన్న వారిని లక్ష్యంగా చేసుకొని ప్రారంభించినట్టు తెలిపారు. 50 నుంచి 80 ఏళ్ల వయస్సు ఉన్నవారు, ఊపిరి తిత్తుల కేన్సర్ లక్షణాలు ఉండటం, ధూమపానం, అలవాటు ఎక్కువగా ఉండడం, ఊపిరితిత్తుల కేన్సర్ ఉన్న కుటుంబంలోని వారు ఈ పరీక్షలు చేసుకోవడం అవసరమని తెలిపారు. తక్కువ డోసు కంప్యూటెడ్ టోమోగ్రఫీ ద్వారా మొదటి విడత స్క్రీనింగ్ చేసి లంగ్ కేన్సర్‌ను గుర్తించవచ్చన్నారు.

భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 7వ వార్డు పరిధి స్వతంత్రనగర్‌లోని శ్రీసాయి లింగేశ్వరస్వామి శివాలయంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్తీకమాస మాసశివరాత్రి పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణాన్ని ఐ.మధుసూదనరావు, వినీలారాణి దంపతుల ఆధ్వర్యాన నిర్వహించారు. సుమారు3500 మంది భక్తులకు భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డు కార్పొరేటర్ మొల్లిహేమలత, మొల్లి లక్ష్మణరావు, నమ్మి శ్రీను, నమ్మి రమణ, కోర్రాయి సురేష్, అధికార్ల కాళిదాసు, ఉగ్గిన నాగరాజు, పోలిమాటి సునీల్ పాల్గొన్నారు.

బ్రోచర్ విడుదల

బ్రోచర్‌ను విడుదల చేస్తున్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బిఎస్ఎన్ఎల్ సహకారంతో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు జరుగనున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌నకు సంబంధించిన బ్రోచర్‌ను మాజీ మంత్రి, అవంతి విద్యా సంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం కళాశాలలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ మాట్లాడుతూ, నెక్స్ట్ జనరేషన్ కమ్యూనికేషన్ నెట్ వర్క్ అంశంపై" ఫ్యాకల్టీ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్"ను డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. అధ్యాపకుల్లో సాంకేతిక నైపుణ్యం మెరుగుపడేందుకు ఈ తరహా ప్రోగ్రాం ఉపయోగపడుతుందన్నారు. ఈ ప్రోగ్రామ్‌ను వినియోగించుకోవాలని కోరారు.

జెఎన్ఎఆర్‌డిడిసితో గీతం ఎమ్ఒయు

ప్రజాశక్తి -మధురవాడ : కేంద్ర ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ అనుబంధ విభాగమైన జవహర్‌లాల్ నెహ్రూ అలూమినియం రీసెర్చి డెవలప్‌మెంట్ అండ్ డిజైన్ సెంటర్ (జెఎన్ఆర్‌డిడిసి)తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం శుక్రవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకుంది. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు సమక్షంలో గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, జెఎన్ఆర్‌డిడిసి గీతం డైరక్టర్ డాక్టర్ అనుపమ్ అగ్నిహోత్రి అవగాహన ఒప్పందాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా అనుపమ్ అగ్నిహోత్రి మాట్లాడుతూ, ఖనిజ అభివృద్ధి రంగంలో చిన్న మధ్య తరహా పరిశ్రమలు, స్టార్టప్‌లను ప్రోత్సహించడానికి నిర్దేశించిన ప్రిజమ్ పథకాన్ని అమలు చేయడంపై తాము దృష్టి పెట్టామన్నారు.

మొక్కల నాటివేత

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఒకటో వార్డు సంతపేటలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో జనసేన వార్డు అధ్యక్షులు పరిమి భువనేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి శుక్రవారం పలు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జన సేన నాయకులు పరిమి ప్రీతం, రమేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

విశాఖ డెయిరీ కార్మికుల దీక్షలో సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెలోకి వెళ్తామని యాజమాన్యాన్ని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని విశాఖ కో-ఆపరేటివ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన విశాఖ డెయిరీ కార్మికులు చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి జగ్గునాయుడు మాట్లాడుతూ, కార్మికుల విజయాన్ని ఏ శక్తీ ఆపలేదన్నారు. కార్మికులది న్యాయమైన పోరాటం అని, విజయం సాధిస్తామని తెలిపారు. విశాఖ డెయిరీ యాజమాన్యం రైతులకు ఇస్తున్న డబ్బులు తగ్గించి, వినియోగదారులకు మాత్రం పాలు రేట్లను పెంచిందని చెప్పారు. కావాలనే రూ.9 కోట్ల నష్టం చూపించి, రైతులను, కార్మికులను మోసం చేస్తుందన్నారు. కార్మికులను నిలువు దోపిడీ చేసి, వెట్టిచాకిరి చేయిస్తోందన్నారు. కార్మికుల మధ్య చీలిక తెచ్చి యాజమాన్యానికి అనుకూలంగా ఉన్న సంఘాన్ని తయారుచేస్తుందని తెలిపారు. బ్రిటీష్ రూల్‌ను విశాఖ డెయిరీ యాజమాన్యం అమలు చేయడానికి చూస్తుందని పేర్కొన్నారు. బ్రిటీష్ వారిని ఇండియా నుంచి తరిమికొట్టిన మాదిరిగానే విశాఖ డెయిరీలో జరుగుతుందని హెచ్చరించారు. కార్మికులకు డిఎ, హెచ్‌ఆర్‌ఎ ఇవ్వడం లేదన్నారు. విశాఖ డెయిరీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు కూడా అమలు చేయడం లేదన్నారు. 20 నుంచి 30 సంవత్సరాల మధ్య సర్వీసు ఉన్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలిపారు. కార్మికులందరూ ఐక్యంగా ఉంటే యాజమాన్యం మెడలు వంచడానికి అవకాశం ఉంటుందన్నారు. యాజమాన్యం తక్షణమే యూనియన్‌తో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.రాజేంద్రప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న జగ్గునాయుడు

ఉత్పత్తికి సహకరించాలి

స్టీల్ అడిషనల్ జనరల్ సెక్రటరీ శుభోద్ కుమార్ సింగ్

ప్రజాశక్తి -ఉక్కునగరం : స్టీల్ ప్లాంట్‌లో ఉత్పత్తికి కార్మికులంతా సహకరించాలని స్టీల్ అడిషనల్ జనరల్ సెక్రటరీ శుభోద్‌కుమార్ సింగ్ కోరారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించేందుకు వచ్చిన ఆయన శుక్రవారం విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాల నేతలతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, యు.రామస్వామి, కెఎస్ఎన్.రావు, జె.రామకృష్ణ, మంత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ, స్టీల్ ప్లాంట్‌కు సమయానికి అవసరమైన ముడి సరుకులు అందజేయాలని, కార్మికులకు జీతాలు సకాలంలో చెల్లించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించిన పలు సమస్యలపై ఆయనతో చర్చించినట్లు నాయకులు తెలిపారు. ఈ సమస్యలను ఉన్నత యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇచ్చారని కార్మిక నేతలు వెల్లడించారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

చైతన్య మహిళా కళాశాలలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో మెడికవర్ హాస్పిటల్, పుష్పగిరి నేత్ర వైద్యశాల, వి డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యాన విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, సుగర్, ఈసీజీ, కేన్సర్ స్క్రీనింగ్, డెంటల్, కంటి పరీక్షలు జరిపారు. మొత్తం 400 మందికి తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రమహాలక్ష్మి, కార్పొరేటర్ స్టాలిన్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటి వ్యర్థాలను నిత్యం సేకరించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రతి వార్డులో నిత్యమూ ఇంటింటి నుంచి వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు సేకరించేలా విధులు నిర్వహించాలని, శానిటరీ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వ్యర్థాలు సేకరించే వాహనాలతో వార్డులలో పర్యవేక్షణ జరిపి వీధులు, కాలనీలు పరిశుభ్రపరచేలా చర్యలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు. జివిఎంసి 26వ వార్డు పరిధి అక్కయ్యపాలెం, చిన్నూరు, ఎన్జీజీవోస్ కాలనీ తదితర ప్రాంతాల్లో శుక్రవారం కార్పొరేటర్ ముక్కా శ్రావణితో కలిసి కమిషనర్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, పారిశుధ్య సమస్యలు, కాలువ నిర్మాణం, తాగునీటి సమస్యలను కమిషనర్‌కు కార్పొరేటర్ శ్రావణి వివరించారు. ఈ సమస్యలపై కమిషనర్ స్పందిస్తూ చిన్నూరు ప్రాంతంలో కాలువల నిర్మాణానికి, తాగునీటి సమస్య పరిష్కారానికి పలుచోట్ల పబ్లిక్ కుళాయిలను వేసేందుకు, అంగన్‌వాడీ కేంద్రానికి మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదనలు చేపట్టాలని, ఎన్జీజీవోస్ కాలనీలోని జివిఎంసి ఉన్నత పాఠశాలలో మరమ్మత్తులకు విద్యాశాఖకు లేఖను పంపించి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కార్యనిర్వాహక ఇంజినీర్ గంగాధర్‌ను కమిషనర్ ఆదేశించారు. వార్డులో పలుచోట్ల గెడ్డలు, కాలువల్లో అధికంగా ఉన్న వ్యర్థాలను పరిశీలించి ఎప్పటికప్పుడు వెలికి తీయాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన పరిచే చర్యలను చేపట్టాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్‌కు కమిషనర్ ఆదేశించారు. గుర్తించిన పలు ప్రదేశాలకు ఖాళీ స్థలాల పన్నులను వసూలు చేయాలని, ఎన్జీజీవోస్ కాలనీ లే-అవుట్‌లో ఓపెన్ స్పేస్‌ను వినియోగంలోనికి తీసుకురావాలని, అన్ని వార్డులలో సచివాలయాల పరిధి శానిటరీ సెక్రెటరీలు, ఇన్‌స్పెక్టర్లు నిత్యం వార్డుల్లో పర్యవేక్షిస్తూ పరిశుభ్రతా చర్యలు చేపట్టేలా పర్యవేక్షణ జరపాలని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను కమిషనర్ ఆదేశించారు. అనంతరం చిన్నూరులో మలేరియా ఇన్‌స్పెక్టర్ సీజనల్ వ్యాధులపై, దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను ప్రజల అవగాహన కోసం నిర్వహిస్తున్న ప్రదర్శనను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ సిహెచ్.మధుసూదనరావు, టిడిపి నాయకులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంలతో సమావేశం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలో నిర్వహించే మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్‌లకు సంబంధించి మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం ప్రధానోపాధ్యాయులకు సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులకు ఎంపిడిఓ ఎం.విజయ్‌కుమార్ సమావేశాలకు సంబంధించి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

ఉక్కు సత్యాగ్రహం చిత్రాన్ని ఆదరించండి

మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించాలనే ఇతివృత్తంతో నిర్మించిన 'ఉక్కు సత్యాగ్రహం' చిత్రాన్ని ప్రజలంతా ఆదరించాలని మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ చలసాని శ్రీనివాస్ కోరారు. గాజువాక శ్రీకన్య థియేటర్‌లో ఉక్కు సత్యాగ్రహం చిత్రం ప్రదర్శన సందర్భంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఉక్కు సత్యాగ్రహం ప్రజల సినిమా అని, ఈ సినిమాను ఆదరించాలని కోరారు. ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకునే లక్ష్యంతో చిత్ర దర్శకుడు పి.సత్యారెడ్డి నిర్మించారని, ఉక్కు కార్మిక నేతలు, కార్మికులు ఈ చిత్రంలో భాగస్వాములు కావడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. ఉక్కు పోరాటాల నేపథ్యంలో నిర్మించిన ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ చూడాలని కోరారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ఉక్కు ఉద్యమ ఆవశ్యకతను ప్రతిబింబించే ఈ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు, నిర్వాసిత నాయకులు పాల్గొన్నారు.

నండూరి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

నండూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మూర్తి తదితరులు

ప్రజాశక్తి -తగరపువలస : కార్మికోద్యమ నేత నండూరి ప్రసాదరావు ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం ఆయన వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు భీమిలి జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, ఉమ్మడి విశాఖ జిల్లాలోని కార్మికవర్గంతో ఆయనకు అవినాభావ సంబంధం ఉందని గుర్తు చేశారు. పలు ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో కార్మికులను, ఉద్యోగులను ఏకం చేసి నిర్వహించిన ఎన్నో ఉద్యమాలకు నండూరి నాయకత్వం వహించారన్నారు. యూనియన్ నాయకులు ఎస్ అప్పలనాయుడు మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు చేయడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు నీలాతి రాము, పల్లా పెంటరాజు, పల్లా రమణ, పంపాన సూర్యనారాయణ, జోగ వెంకట్రావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అంతర జిల్లాల క్రీడా పోటీల్లో 'విడిఎ' ప్రతిభ

ప్రజాశక్తి -గాజువాక : ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహించిన అంతర్ జిల్లాల క్రీడా పోటీల్లో విశాఖ డిఫెన్స్ అకాడమీకి చెందిన డిగ్రీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పురుషుల విభాగం 5000 మీటర్ల పరుగు పందెంలో బిసిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎం.చిన్న ద్వితీయ స్థానం, మహిళల విభాగంలో 3000 మీటర్ల పరుగు పందెంలో ఉమామహేశ్వరి మూడవ స్థానం, 4 X 400 మీటర్ల పరుగు పందెంలో పి.అఖిలశ్యామ్ సుందరి బ్రాంజ్ మెడల్ సాధించడంతో వారందరినీ కళాశాల డైరెక్టర్లు బండి శ్రీనివాసరావు, డిఎస్ఎన్.కృష్ణ సన్మానించారు.

గెలుపొందిన విద్యార్థులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్య ప్రతినిధులు

శానిటేషన్‌లో అలసత్వం వద్దు

ప్రజాశక్తి-పెందుర్తి : శానిటేషన్ పనుల విషయంలో అలసత్వం వద్దు అని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సూచించారు. జివిఎంసి 95వ వార్డు పరిధి దాట్ల మెన్షన్ కల్యాణ మండపంలో జివిఎంసి జోనల్ కమిషనర్ హైమావతి ఆధ్వర్యాన జోనల్ అధికారులు, సచివాలయం, టౌన్ ప్లానింగ్ అధికారులు, విఆర్‌ఒలు, శానిటరీ విభాగం అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు హాజరై మాట్లాడారు. ప్రభుత్వ అధికారులు అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు సేవలందించాలన్నారు. అధికారులకు ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వసంత శంకరరావు, బల్లా శ్రీనివాసరావు, రాపర్తి కన్నా, నాయకులు దాట్ల మధు, కంచిపాటి మధు, సేనాపతి సోమశేఖర్, పిన్నింటి పార్వతి, అయితే సింహాచలం నాయుడు, జగన్మోహన్, గొర్ల అప్పారావు, ఆర్ఎస్.నాయుడు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం అభివృద్ధికి ప్రణాళిక

ప్రజాశక్తి-గోపాలపట్నం : గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, స్కేటింగ్ గ్రౌండ్ నిర్మాణం, క్రీడాకారుల వ్యాయామ పరికరాలు ఏర్పాటు కోసం తగిన ప్రణాళికలు సిద్ధంచేయాలని అధికారులకు విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు ఆదేశించారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని ఎమ్మెల్యే గణబాబుతో పాటు జివిఎంసి డిఇ ప్రవీణ్‌కుమార్, ఆంధ్రా యూనివర్శిటీ ప్రొఫెసర్ సత్యనారాయణ సందర్శించారు. వర్షాకాలంలో క్రీడా ప్రాంగణంలో నీరు నిల్వ ఉండకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలు గురించి అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకటలక్ష్మి, తెలుగుదేశం నాయకులు దాడి రమేష్, మూర్తి పట్నాయక్, బాక్సింగ్ కోచ్ శ్రీను, తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

సిఐ అప్పారావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గోపాలపట్నం : గోపాలపట్నం పోలీసు స్టేషన్ లా అండ్ ఆర్డర్ సిఐగా గొలగాని అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సోషల్ మీడియా సెల్‌లో పనిచేస్తున్న గొలగాని అప్పారావును గోపాలపట్నం పోలీసు స్టేషన్‌కు బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేసిన కె.సురేష్‌ను సోషల్‌మీడియా సెల్‌కు బదిలీచేశారు. బాధ్యతలు స్వీకరించిన సిఐని సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

రాగూర్ ఫార్మా ప్రమాదంపై సమగ్ర విచారణ జరపాలి

మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలి

- సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ ఫార్మా సిటీలోని రాగూర్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టాలని, కంపెనీ యాజమాన్యం పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన శుక్రవారం లంకెలపాలెం జంక్షన్లో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ రాగూర్ ఫార్మాలో మంగళవారం రాత్రి విష రసాయన వాయువులు లీకై 27మంది కార్మికులు అస్వస్థకు గురి కాగా, ఒరిస్సా రాష్ట్రానికి చెందిన అభిత్ బాస్, పురాపురానికి చెందిన సిహెచ్.వీరశేఖర్ మృతి చెందారని, మరో కార్మికుడు టి.చిన్నికృష్ణ పరిస్థితి విషమంగా వుందని పేర్కొన్నారు. ఈ సంఘటన జరిగిన తరువాత గుట్టుచప్పుడు కాకుండా రహస్యంగా యాజమాన్యం వారిని తరలించిందని, సకాలంలో వైద్య సేవలు అందించి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని గనిశెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మా పరిశ్రమల్లో కార్మికుల ప్రాణాలను యాజమాన్యాలు గాలికి వదిలేస్తున్నాయని, భద్రతా ప్రమాణాలు పాటించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యాల పట్ల ఉదాసీనంగా వుండడం వల్లే తరుచూ ఈ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు కార్మిక శాఖ మంత్రి కేవలం రూ.40 లక్షల మాత్రమే ప్రకటించి యాజమాన్యాలకి అండగా నిలిచారని మండిపడ్డారు. ఇప్పటికే సెనర్జీన్లో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించగా, పక్కనే ఉన్న రాగూర్ పరిశ్రమలో మృతులకు కేవలం రూ.40 లక్షల ప్రకటించడం దారుణమన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయలు చొప్పున నష్ట పరిహారం చెల్లించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రాస్తారోకో చేస్తున్న కార్మికులు

6 బైక్‌లు స్వాధీనం

ప్రజాశక్తి-యలమంచిలి : వివిధ ప్రాంతాల్లో దొంగతనం చేసిన రూ.5లక్షలు విలువ చేసే 6 బైక్‌లను స్వాధీనం చేసుకొని, నిందితులను అరెస్టు చేసినట్లు యలమంచిలి సిఐ ధనుంజయరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ దొంగతనాలకు పాల్పడిన వారు పాత నేరస్తులేనని, వారు ఇది వరకు జైలుకెళ్లిన సందర్భాలున్నాయని పేర్కొన్నారు. యలమంచిలికి చెందిన కొరాడ భాను, వెదుళ్ల సుబ్రమణ్యం, భూపతి శివనాగు చిన్నప్పటి నుంచి చెడు అలవాట్లకు, జల్సాలకు అలవాడు పడి నేరాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వీరిపై పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్‌రాయవరం, తుని, యలమంచిలి పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయై ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ ఎస్ఐ పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-అనకాపల్లి : జీవీఎంసీ 84వ వార్డు పరిధి కొండకొప్పాకలో డ్రైనేజీ నిర్మాణ పనులను ఆ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి ఎం.నీలబాబు శుక్రవారం పరిశీలించారు. జివిఎంసి నిధులు 4 లక్షలతో దీనిని నిర్మిస్తున్నారు. కాలువ నిర్మాణ నాణ్యతను నీలబాబు పరిశీలించి, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వానపల్లి బాబురావు, బోయిన మురళి, మిత్తిపాటి గోపాలరావు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. ఆయా వార్డుల కౌన్సిల్ సభ్యులతో పాటు సంబంధిత అధికార్లు కూడా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ పేర్కొన్నారు. పట్టణంలో శుక్రవారం డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టుకొని ఒక్కొక్కరికి రూ.535 చొప్పున జరిమానా విధించారు. మైనర్ల తల్లిదండ్రులకు, మైనర్ డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

చింతలపాలెంలో వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి-కశింకోట : భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు జన్మదిన వారోత్సవాలలో భాగంగా ఆరవ రోజు శుక్రవారం మండలంలోని చింతలపాలెం గ్రామంలో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, ఎపియుఎఫ్ఐడిసి చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోట్ని బాలాజీ, గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, నైనంశెట్టి రమణారావు, మళ్ల బాబు, మాజీ సర్పంచ్‌లు బుద్ధిరెడ్డి గంగయ్య, మేడిశెట్టి రమణ, కరి దుర్గునాయుడు, కోన రమణ, బల్ల అప్పలకొండ పాల్గొన్నారు

వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న పీలా గోవింద తదితరులు

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

ఎస్‌పి తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి : రోడ్డు ప్రమాదాల నివారణకు అనకాపల్లి జిల్లాలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వలన ఎక్కువమంది ప్రమాదాల్లో మరణిస్తున్నారన్నారు. 2024లో అనకాపల్లి జిల్లాలో ద్విచక్ర వాహన ప్రమాదాల కేసులు 103 నమోదు అవ్వగా, 104 మంది మృతి చెందగా, 35 మంది క్షతగాత్రులు అయ్యారని పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనదారులు మొదటిసారి పట్టుబడితే జరిమానా, రెండోసారి పట్టుబడితే 3 నెలల పాటు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామన్నారు. అతివేగంగా నిర్లక్ష్యంగా నడిపిన, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్లో ప్రయాణించిన, హెల్మెట్ ధరించి క్లిప్ పెట్టకపోయినా, ఐఎస్ఐ మార్క్ (నాణ్యమైన) హెల్మెట్ వాడకపోయినా, వెనక కూర్చున్న వ్యక్తి కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించకపోయినా కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ చలాన్లు మూడు కంటే ఎక్కువ కట్టకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేసి జరిమానా కట్టిన తర్వాతే వాహనాన్ని ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న ఎస్‌పి తుహిన్ సిన్హా

కూటమి ప్రభుత్వంలో పంచాయతీల అభివృద్ధి

సమావేశంలో పాల్గొన్న కూటమి నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో పంచాయితీలకు నిధులు ఇచ్చి అభివృద్ధి చేయడం జరుగుతుందని పలువురు సర్పంచులు, ఎంపిటీసీలు పేర్కొన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచులు, ఎంపిటీసీలు, కూటమి నాయకుల సమావేశం జరిగింది. మారేడుపూడి, మాకవరం, సంపతిపురం, కూండ్రం సర్పంచ్‌లు సాలాపు కనకరాజు, భవాని నూకరాజు, సంబారి శ్రీను నాగమణి, సందారపు లక్ష్మి సూరిబాబు మాట్లాడుతూ అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషితో గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు నేరుగా విడుదల కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మపాల ఎంపిటీసీ సభ్యుడు చదరం నాగేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి భరత బాబు, తుమ్మపాల మాజీ సర్పంచ్ కరి బాబి, జనసేన నాయకులు బంటు రవి, గంగుపాము జగదీష్, బత్తుల రమేష్, కొసిరెడ్డి త్రినాథ్, పాల్గొన్నారు.

ప్రకృతి పరీక్ష అభియాన్ యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : దేశ్ కా ప్రకృతి పరీక్ష అభియాన్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల కే లావణ్య కోరారు. స్థానిక ఆయుర్వేద వైద్యశాలలో శుక్రవారం రోగులకు యాప్‌పై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఈ యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని ప్రకృతి వాత కఫా పిత్త దోషాలను తెలుసుకోవచ్చని చెప్పారు. దినచర్య, రుతు చర్య ఎలా ఉండాలి, కార్యక్రమంలో యోగా టీచర్ చంద్రిక, అప్పారావు పాల్గొన్నారు.

గవర కార్పొరేషన్ చైర్మన్ సురేంద్రకు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన మళ్ల సురేంద్రను శుక్రవారం వారి స్వగృహంలో విజయరామరాజుపేట గ్రామ కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలుసుకొని సత్కరించారు. కార్యక్రమంలో ఆళ్ల శివ రామకృష్ణ, పలక రాము, పిట్ల బుద్దీన్, బొబ్బిలి అప్పారావు, పలక సత్యనారాయణ, పోలవరపు త్రినాథ్, పూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : వాయుగుండం నేపథ్యంలో రైతులు వ్యవసాయశాఖ సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి పొలాలను సందర్శించి రైతులతో ఆయన మాట్లాడారు. ఇప్పటికే పంట కోయలేని రైతులు వాయిదా వేసుకోవాలని, కోతలు కోసి పొలాల్లోనే వరికుప్పలు వేసినట్లయితే వాటిపై టార్పాలిన్లు కప్పాలని సూచించారు. ఒకవేళ భారీ వర్షాలు పడినట్లయితే పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా నీటిని తీసివేయాలని, ఎక్కడైనా ధాన్యం తడిస్తే మొలక రాకుండా ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని తడిసిన వరి పనలపై పిచికారి చేయాలని కోరారు. రైతులు కంగారు పడకుండా కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే నష్టాన్ని నివారించుకోవచ్చని చెప్పారు.

ఎల్ఐసి ఏజెంట్లు నిరసన

ప్రజాశక్తి-చోడవరం : తమ సమస్యలపై బీమా సంస్థ ఏజెంట్లు చోడవరం ఎల్ఐసి ఆఫీస్ వద్ద శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ విశాఖపట్నం డివిజన్ అధ్యక్షులు ఎం నాగరాజు మాట్లాడుతూ క్లా బ్యాక్ ఆఫ్ కమిషన్ నిబంధన తొలగించాలని, పాలసీదారుడు నుంచి జిఎస్టి రద్దు చేయాలని, చిన్న ఏజెంట్ కూడా 2 లక్షల వరకు మెడి క్లెయిమ్ వర్తింపజేయాలని, గ్రూప్ 10 ఇన్సూరెన్స్ 85 సంవత్సరాల వరకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షులు ఎన్ మోహన్‌రావు, కోశాధికారి టీ నూకరాజు, ఎన్ అప్పలనాయుడు, ఏజెంట్లు పాల్గొన్నారు.

ఖోఖో పోటీల్లో ఎఎంఎఎల్ కళాశాలకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆంధ్ర యూనివర్సిటీ ఇంటర్ కాలేజియేట్ ఖోఖో పోటీల్లో అనకాపల్లి ఏఎంఏఎల్ కళాశాల టీం ప్రథమ స్థానం సాధించింది. ఈ విజయం పట్ల కళాశాల పాలకవర్గం, అధ్యాపక వర్గం, విద్యార్థులు క్రీడాకారులను అభినందించారు. మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అనకాపల్లి వరకు సిటీ బస్సు పాస్‌లు ఇవ్వాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆర్టీసీ సిటీ బస్సు పాస్‌లు అనకాపల్లి వరకు ఇవ్వాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక శుక్రవారం ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా కేంద్రం అయిన నేపథ్యంలో బైపాస్ మీదుగా వెళ్లే అన్ని సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ బస్సులు అనకాపల్లి కాంప్లెక్స్ రావాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు చిన్ని యాదవ్, సూదికొండ మాణిక్యాలరావు, బొడ్డు సోమరాజు, బొబ్బిలి గోవిందరాజు, ముగడ అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు పాల్గొన్నారు.

గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : కొండపాలెం చెరువు నుండి గోపిశెట్టి వారి కల్లాలకు గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం జెడ్‌పిటిసి దొండా రాంబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో పాటు జెడ్పిటిసిల నిధులు రూ.5 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గోపిశెట్టి శ్రీను, ముచ్చకర్ల తాతీలు, రామనాయుడు, ముచ్చకర్ల అప్పారావు, ఎంపీటీసీ కే వెంకటరమణ, ఉప సర్పంచ్ దేవర మునలి నాయుడు, జి రమణ, జి నూకరాజు, జి జోగి నాయుడు, జి నాయుడు, జి రవితేజ, జి ఈశ్వరరావు, ఏ శ్రీనివాస్, షేక్ రెహమాన్, జి ఆనంద్, గుండు గణేష్, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘంటసాల జయంతిని ప్రభుత్వ అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : సుప్రసిద్ధ సినీ గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతిని ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్లా నాగభూషణం శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

చలిసింగం సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి -కొత్తకోట: చలిసింగం గ్రామానికి రహదారి, తాగునీరు సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చోడవరం జనసేన ఇన్‌ఛార్జ్ పివిఎస్ఎన్ రాజు అన్నారు. శుక్రవారం మూడు కిలోమీటర్లు దూరం కొండపై కాలి నడకన వెళ్లిన రాజు బృందం, అక్కడ గిరిజనులతోరోజంతా గడిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ దశాబ్దాలుగా గిరిజనులు పడుతున్న ఇక్కట్లను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నారు. అటవీ శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ సిబ్బంది సంయుక్తంగా మూడు కిలోమీటర్ల మేర సర్వే చేసి 42 పాయింట్లుగా గుర్తించి నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపించారన్నారు. కార్యక్రమంలో బలిజ మహారాజు, కొత్తేమ్ అప్పారావు, సోమిరెడ్డి శివశంకర్, సోమి రెడ్డి పరమేష్, పిల్ల అప్పలనాయుడు మధుమంతిసూర్య, గల్లా స్వామి, కోన రమణ, చింతల కిషోర్, పరవాడ దొరబా బు, ఈటంశెట్టి ఈశ్వరరావు, పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారి

మద్యం షాపుల యజమానులు నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మద్యం షాపు యజమానులు నిబంధనలు తప్పకుండా పాటించాలని ఉమ్మడి విశాఖ జిల్లా ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. మండల కేంద్రంలో రమా వైన్స్, శ్రీ వైన్స్, పయనీర్ వైన్స్ షాపులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఒక షాపులో సీసీ కెమెరా లేకపోవడం గుర్తించి వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మద్యం షాపులను శుక్రవారం ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 331 మద్యం షాపులు ఉన్నాయని, వాటిలో 40శాతం షాపులను సందర్శించి నిబంధనలు పాటిస్తున్నారా? లేదా? అన్న విషయంపై తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దుకాణాల్లో ఎమ్మార్పీ రేట్ల పట్టికను అందుబాటులో ఉంచాలని, ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని సూచించారు. 21 సంవత్సరాలు పైబడిన వారికి మాత్రమే మద్యం విక్రయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక ఎక్సైజ్ సిఐ డి.అనిల్ కుమార్, ఎస్ఐ ఎవి రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

మూలికా వైద్యంతో వ్యాధులు నయం

ప్రజాశక్తి-మునగపాక : మూలికా వైద్యంతో అన్ని వ్యాధులు నయం చేయవచ్చునని స్థానిక ఆయుర్వేద వైద్యులు అలుగోలు ప్రసాదరావు, కోడూరు ఆశ్రమ వైద్యులు సుందర్ రాజు పెరుమాళ్ళు పేర్కొన్నారు. స్థానిక రాహుల్ గాంధీ కళ్యాణ మండపంలో రెండు రోజులుగా జరుగుతున్న వివిధ రాష్ట్రాల స్థాయి ఔషధ విజ్ఞాన సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇతర వైద్యానికి తగ్గలేని అనేక వ్యాధులు మూలికా వైద్యంతో తగ్గించవచ్చునని తెలిపారు. వాత, పిత్త, కఫ దోషాల వల్ల కలిగే వ్యాధులను ఎలా నయం చేసుకోవచ్చునో సూచించారు. కార్యక్రమంలో పారంపర్య వైద్యులు విజయానంద స్వామి, బాలకృష్ణ, అల్లక రాజు, సుధారాణి, ఎల్ శ్రీనివాస్, ప్రసాద్, జాన్సీ లక్ష్మి, ఆగస్త్య, యాత్రి మహర్షి, రమేష్, ఆరూరి బాలనర్సయ్య, లావణ్య, మారుతి, రఘుపతి, పీహెచ్సీ వైద్యురాలు డాక్టర్ విమలగిరి పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : అచ్యుతాపురం ఎల్‌టి లైన్ చోడపల్లి ఫీడర్లో చెట్ల నరికివేత పనుల కారణంగా శనివారం చోడపల్లి, కొత్త మోసయ్యపేట గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సత్యనారాయణ దేవస్థానం చైర్మన్ మురళికి సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సుంకరమెట్ట శ్రీసత్యనారాయణ సూర్యనారాయణ ఆలయ చైర్మన్‌గా నియమితులైన బొడ్డేడ మురళిని శుక్రవారం శ్రీభోగలింగేశ్వర స్వామి దేవస్థానంలో హర హర మహాదేవ మాలధారణ సిండికేట్ ఘనంగా సత్కరించింది. గురుస్వామి ఎల్లపు చంద్రమోహన్, వేద పండితులు పేరూరి చిన్ని, పేరూరి గోపి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. మురళి భవిష్యత్తులో ఇలాంటి పదవులు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో వీరునాయుడు, కాండ్రేగుల అప్పారావు, కర్రి అప్పాజీ, పెతకంశెట్టి గంగాధర్, సూర్యం, దేవస్థానం అర్చకుడు రాము పాల్గొన్నారు.

మురళిని సత్కరిస్తున్న దృశ్యం

2న విశాఖ డెయిరీ ముట్టడికి తరలిరండి

గ్రామాల్లో రైతు సంఘం నేతలు విస్తృత ప్రచారం
తగ్గించిన ఆవు పాల ధరను పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి-చోడవరం

విశాఖ డెయిరీ తగ్గించిన ఆవు పాల ధరను పెంచాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి రైతు, పాల రైతుల సంఘాల ఆధ్వర్యాన జరుగు విశాఖ డెయిరీ ముట్టడి కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్రవు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని గజపతినగరం, జుత్తాడ, అంబేరిపురం, గోవాడ గ్రామాల్లోని పాల కేంద్రాల వద్ద శుక్రవారం రైతులను నేరుగా కలుసుకొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ విశాఖ డెయిరీ ఆవు పాలు సేకరణ ధర లీటరుకు రూ.3 నుండి రూ.4 వరకు తగ్గించడంతో రైతులు రోజుకు రూ.20 లక్షలు నష్టపోతున్నారని తెలిపారు. పాల సేకరణకు తక్కువ ధర ఇస్తూ, డెయిరీ చేసే ఉత్పత్తులను అధిక ధరకు అమ్ముతున్నారని పేర్కొన్నారు. డెయిరీ యాజమాన్యం మోసాన్ని రైతుల ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్వీ నాయుడు, పాల రైతు సంఘం జిల్లా అధ్యక్షులు భూలోక నాయుడు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని పి.భీమవరం, వడ్డాది, దిబ్బిడి, బంగారుమెట్ట తదితర గ్రామాల్లో కేంద్రాల వద్ద శుక్రవారం రైతులతో ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్రవు సూర్యనారాయణ మాట్లాడారు. ఇప్పటికే రైతులకు పాల ధర గిట్టుబాటు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆవుపాలు సేకరణ ధర తగ్గించడం దారుణమన్నారు. విశాఖ డెయిరీ తగ్గించిన పాల ధర పెంచే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రైతు నాయకులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : విశాఖ డెయిరీ ముట్టడిపై మండలంలోని లంకవానిపాలెం, పిండ్రంగి, గవరపాలెం గ్రామాల్లో రైతు సంఘం నాయకులు శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రొంగలి ముత్యాల నాయుడు, ఏపీ పాల రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెనగంటి నాయుడు మాట్లాడుతూ ఆవు పాలు లీటర్‌కు రూ.50, గేదె పాలు లీటర్‌కు రూ.80 చొప్పున కనీస ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు వనము సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయా గ్రామాల పాడి రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యనారాయణ

ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అసంఘటితరంగ కార్మికులైన ముఠా కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని ముఠా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ముఠా వర్కర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ట్రాన్స్‌పోర్ట్ లోడింగ్, అన్‌లోడింగ్ వంటి పనులు చేస్తూ దేశ ప్రగతిలో భాగస్వామ్యం అవుతున్నారని తెలిపారు. కాని వీరికి ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందడం లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే ముఠా కార్మికులకు సూపర్ సిక్స్ పథకాలు, సమగ్ర చట్టం చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కూటమి నేతలు, ఇప్పుడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు వారిని, వారి కుటుంబాలను ఆదుకునేందుకు ఏ ప్రభుత్వం ముందుకు రాలేదని వాపోయారు. ఈ నేపథ్యంలో ముఠా కార్మికుల సమగ్ర చట్టం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ముఠావర్కర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 60 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వమే వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు గంటా శ్రీరామ్, నాయకులు మంద రాము, సురేష్, బోడి రాజు, అప్పలనాయుడు, కనకాల అప్పల రాజు, కాపు శెట్టి అప్పారావు పాల్గొన్నారు.

గీత కార్మికులకు 20 శాతం మద్యం షాపులు కేటాయించాలి

ప్రజాశక్తి-కశింకోట

కల్లుగీత కార్మికులకు 20 శాతం రిజర్వేషన్ పెంచి మండలానికి ఒక మద్యం షాపును కేటాయించాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యర్రా దేముడు డిమాండ్ చేశారు. మండలంలోని తాళ్ళపాలెంలో మండల గీత కార్మిక సంఘం సమావేశం జరిగింది, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమ నిధికి రూ.5వేల కోట్లు కేటాయించాలని, ప్రమాదంలో మృతి చెందిన గీత కార్మికులకు రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని, బీమా అమలు చేసి, ప్రభుత్వం ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని, సొసైటీ సభ్యత్వం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కశింకోట, బయ్యవరం, వెదురుపర్తి, నర్సింగబిల్లి గీత కార్మికులు సంఘం అధ్యక్షులు కట్టా ఈశ్వరరావు, పోలుసు మహలక్ష్మి నాయుడు, దమ్ము జాన్, తుట్టా అప్పారావులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో చప్పిడి ఆంజనేయులు, పిల్లి అప్పారావు, దుంగా సత్యనారాయణ, మునషా మోహన్, పిల్లి సతీష్, బండా బాబు రావు, నాగలి శ్రీను పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని ఏటికొప్పాక, పేటబయ్యవరం గ్రామాల్లో శుక్రవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో నియోజకవర్గంలోని కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేసి ఊహించిన దానికంటే సభ్యత్వ నమోదు ఎక్కువ చేశారని అభినందించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కాండ్రకోట చిరంజీవి, కొలకలూరి విజయబాబు, ఇత్తంశెట్టి రాజావెంకటరమణ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, రాజాన నారాయణమ్మ, రాజాన వెంకునాయుడు, ఎంపిటిసి నీరుకొండ నర్సింగరావు, యాంద్ర అప్పలనాయుడు, బాబూరావు, ఎడ్ల కాంతారావు, లాలం రాజు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : మండలంలో బయ్యవరం గ్రామంలో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎస్‌కె బాబర్, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు ఎస్ వెంకటలక్ష్మి, సిహెచ్ కన్నయ్యమ్మ, సిహెచ్ రాజు, బి.గంగరాజు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

శివాలయం ప్రథమ వార్షికోత్సవం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం పి.భీమవరం బంగారుమెట్ట మార్గమధ్యలో ఉన్న శ్రీభీమలింగేశ్వర స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు భీమలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. చిన్నారుల కోలాటం పలువురిని ఆకట్టుకుంది.

బర్నికాన కుటుంబానికి వైసిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-సబ్బవరం : అనకాపల్లి జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్షులు, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బర్నికాన సాయినాధరావు చిన్న కుమారుడు గత గురువారం మృతి చెందిన నేపథ్యంలో వైసిపి పెందుర్తి నియోజకవర్గం నాయకుడు గండి రవికుమార్ శుక్రవారం సాయినాథరావు ఇంటికి వచ్చి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో అసకపల్లి ఎంపీటీసీ కర్రి అప్పారావు, వైసీపీ యువజన విభాగం మండల అధ్యక్షులు యడ్ల నాయుడు, ఉప సర్పంచులు సురేష్, సిరపరపు వాసు, వైసిపి నాయకులు మొల్లి చిన్నారావు, ధూళి నరేష్, సేనాపతి దుర్గ అప్పారావు, బోలెం శంకర్, బోలెం రాజు, మంగబాబు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో డిగ్రీ కళాశాల విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి-సబ్బవరం : ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల యోగా పోటీల్లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి పండూరి జయలక్ష్మి పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. డిసెంబర్ 24 నుండి 28 వరకు భువనేశ్వర్‌లోని కళింగ యూనివర్సిటీలో జరుగు అఖిల భారత స్థాయి పోటీలకు ఎంపికైంది. తానాం గురుకుల విద్యాలయంలో యోగా నిరంతరం ప్రాక్టీస్ ద్వారా ఈ విజయం సాధించినట్లు ఈ సందర్భంగా జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి సీతాలక్ష్మి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ గణేష్ అభినందనలు తెలియజేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- సబ్బవరం : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25, 26 తేదీలలో పల్నాడు జిల్లా ఆరేకె పురం గురుకుల పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో స్థానిక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థులు సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ ఎన్.రామకృష్ణ తెలిపారు. ఈ పోటీలలో తమ విద్యార్థులు ఐసీటీ వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రథమ స్థానం సాధించి రూ.7500 నగదు బహుమతి అందుకున్నారని, క్రాఫ్ట్ వైజ్ఞానిక ప్రదర్శనలో ద్వితీయ స్థానం సాధించారని పేర్కొన్నారు. విజయం సాధించిన విద్యార్థులు ఎం అశోక్, డి విశ్వనాథ్, ఎల్ మున్నా, జె సంపత్ వినయ్, గైడ్ టీచర్లు డాక్టర్ టి. రాంబాబు, డి. నానాజీలను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఉమ్మడి జిల్లాల గురుకుల విద్యాలయాల సమన్వయ కర్త అయిన ఎస్ రూపవతి, డిఇఒ అప్పారావు నాయుడు నక్కపల్లిలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

ఘనంగా ఇండస్ట్రీ అకాడెమియా కాన్‌క్లేవ్

ప్రజాశక్తి-సబ్బవరం : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపిఈ) ఆధ్వర్యాన ఇండస్ట్రీ - అకాడెమియా కాన్‌క్లేవ్ 2024ను విశాఖలోని హోటల్ గ్రీన్ పార్క్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన మాట్లాడుతూ ఇంధన రంగంలో పురోగతి, సవాళ్లను చర్చించడానికి విద్యావేత్తలు, పరిశ్రమలను ఒకచోట చేర్చినట్లు తెలిపారు. డాక్టర్ పొలమరశెట్టి అపరాయ్, డాక్టర్ హేమంత్ తన్నేరు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ అపరోయ్, ప్రొఫెసర్. విజయ్ కుమార్, కనుపర్తి నాగరాజా, డాక్టర్ సెంథిల్మురుగన్ బాలసుబ్రమణియన్, డాక్టర్ మురళీకృష్ణ కలగ తదితరులు మాట్లాడారు.

కొత్త పరికరాలు రూపొందించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : బీటెక్ చదివే విద్యార్థులు నూతన ఆలోచన విధానంతో కొత్త కొత్త పరికరాలు రూపొందించాలని స్ట్రాటజిక్ ఐపీఎల్ మేనేజ్‌మెంట్ రిసోర్స్ పర్సన్ డాక్టర్ విజయ్ కుమార్ సాహు అన్నారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు ఎఫ్‌డిపిలో భాగంగా జరిగిన కార్యక్రమంలో శుక్రవారం రిసోర్స్ పర్సన్‌గా డాక్టర్ విజయ్ కుమార్ సాహు ప్రసంగించారు. అనంతరం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ట్రెండ్స్ ఇన్ రీసెర్చ్ ఇన్నోవేషన్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

విద్యార్థులకు కాపీ రైటింగ్ బుక్స్ పంపిణీ

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం చీలకవానిపాలెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వైస్ ఎంపీపీ మత్స భవానిప్రసాద్ శుక్రవారం ఇంగ్లీష్ కాపీ రైటింగ్ బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేసారు. ఆ పాఠశాలలో 62మంది విద్యార్థులు 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్నారు. వీరు ప్రైవేట్ స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంలో విద్యను అభ్యసించాలనే ఉద్దేశ్యంతో వైస్ ఎంపీపీ తన సొంత డబ్బులతో ఇంగ్లీష్ కాపీ రైటింగ్ బుక్స్ తెప్పించి హెచ్ఎం శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్మన్ బుదిరెడ్డ రాము ద్వారా విద్యార్థులకు పంపిణీ చేసారు. ప్రతి ఏడాది విద్యార్థులకు ఏదో ఒక రూపంలో వైస్ ఎంపిపి భవాని ప్రసాద్ సహాయపడుతుంటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు మత్స అర్జున పాల్గొన్నారు.

ఏకగ్రీవ పంచాయతీల ప్రోత్సాహక నిధులకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి -కోటవురట్ల : ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా పంచాయతీ అధికారి శిరీష రాణి తెలిపారు. శుక్రవారం నక్కపల్లి గ్రామంలో ప్రజా దర్బార్‌లో ఏకగ్రీవ పంచాయతీ నిధులపై జనాభా ప్రాతిపదికన 2 వేల జనాభా దాటిన గ్రామానికి రూ.10 లక్షలు, 2వేల జనాభా దిగువన ఉన్న గ్రామాలకు రూ.ఐదు లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులు ఇవ్వాల్సి ఉంది. 2022లోనే సంబంధిత నిధులు మంజూరు అయ్యాయని అయితే గ్రామాలకు పంపించేందుకు కొత్తగా ఏర్పడ్డ జిల్లాల కారణంతోసాంకేతిక సమస్యలతో నిధులు వెనక్కు వెళ్లిపోయాయన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ చొరవతో తిరిగి నిధుల మంజూరుకు అన్ని ప్రతిపాదనలు సిద్ధం చేశామని విడతలవారీగా జిల్లాలకు నిధులు మంజూరు అవుతున్నట్లు తెలిపారు, జిల్లా వ్యాప్తంగా 64 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, వాటిలో 13పంచాయతీలకు రూ.10 లక్షల చొప్పున, 51 పంచాయతీలకు రూ.ఐదు లక్షల చొప్పున ప్రోత్సాహక నిధులు విడుదలౌతాయన్నారు.

చురుగ్గా సిసి రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని కసిమి పంచాయతీలో సిసి రోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఈ పనులను టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు జి.బాబూరావు పర్యవేక్షించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్ఆర్ఇజీఎస్ నిధులతో ఈ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కూటమి హయాంలో గ్రామీణ రోడ్లు బాగుపడుతున్నాయన్నారు.

రోలుగుంట : మండలంలోని శరభవరం గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇటీవల ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు ఆధ్వర్యంలో రూ.50లక్షలు ఉపాధి నిధులు మంజూరుకాగా, గ్రామంలో ఎనిమిది పనులు చేపడుతున్నట్లు ఉప సర్పంచ్ పంచాద చంద్ర తెలిపారు.

ఒక్క రోజు ముందే పింఛన్లు

ప్రజాశక్తి - రావికమతం : వచ్చేనెల 1న ఆదివారం సెలవు దినం కారణంగా, ఒకరోజు ముందుగా డిసెంబర్ నెల పింఛన్లును ఈనెల 30న శనివారం తెల్లవారు జామునుంచే పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ భానోజీరావు తెలిపారు.

బిర్సాముండాకు ఘననివాళి

ప్రజాశక్తి -కొత్తకోట : స్వాతంత్ర సమరంలో పాల్గొని స్ఫూర్తిని రగిలించిన అగ్రశ్రేణి పోరాట యోధుడు బిర్సా ముండా ఆదివాసీలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని చోడవరం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ పివిఎస్ఎన్ రాజు అన్నారు. శుక్రవారం రావికమతం మండలం చీమలపాడు శివారు గిరిజన గ్రామం చలిసింగంలో బిర్సా ముండా 150 వ జయంతిని ఘనంగా నిర్వహించారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలోని పెట్టుగోళ్లపల్లి గ్రామానికి చెందిన మల్లు స్రవంతి అనే యువతి కనిపించడంలేదని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : వచ్చేనెల 20 నుంచి 22 వరకు నర్సీపట్నంలో నిర్వహించే సిపిఎం అనకాపల్లి జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి వెంకన్న, జి. కోటేశ్వరరావు మండల కార్యదర్శి ఎ.రాజు, ఇ.చిరంజీవి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సిఐటియు కార్యాలయంలోమహాసభల పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నూతనంగా అనకాపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా నర్సీపట్నంలో సిపిఎం జిల్లా మహాసభలు జరుగుతున్నాయన్నారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడం, అపారిశుధ్యం, దోమల బెడద వంటి సమస్యలపై మున్సిపాలిటీ సిబ్బంది దృష్టిపెట్టి పరిష్కరించాలని కోరారు. మున్సిపాలిటీలో పారిశుధ్య సిబ్బందిని పెంచాలన్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపు మానుకోవాలని, విద్యుత్ ఛార్జీలు, నిత్యావసరాల ధరాభారం తగ్గించాలని,జిల్లాలో మూతబడిన సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని కోరారు. జిల్లాలోని

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నేతలు

నాన్‌షెడ్యూల్ గ్రామాలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. జిల్లాను సమగ్ర అభివృద్ధి చేయాలని, నిరుద్యోగ యువతకుఉపాధి అవకాశాలు కల్పించాలని,బిటి రోడ్లు మరమ్మతులు చేపట్టాలని ఉద్యోగ ఉపాధి కార్మికులు సమస్యలపై భవిష్యత్ ఆందోళనకు జిల్లా మహాసభల్లో చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

ఇనాం భూముల్లో పంటల సాగుపై పరిశీలన

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని జెపి.అగ్రహారం గ్రామంలో ఇనాం భూమిలో సాగులో ఉన్న రైతులను, వారు పండిస్తున్న పంటలపై శుక్రవారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. సర్వే నెంబరు 48 నుండి 93 వరకు ఉన్న భూమిలో ఎవరెవరు సాగులో ఉన్నారు? ఏయే పంటలు వేశారనే దానిపై ఎంఆర్ఐ రామ్మూర్తి, సర్వేయర్ మహేష్, విఆర్ఒ రాము వివరాలను సేకరించారు. . సాగురైతులు దుంగల యర్రాపాత్రుడు, బుచ్చిరాజు విచారణకు సహకరించామని తెలిపారు. ఈ భూమిలో తాతతండ్రుల నుండి సుమారు 200 కుటుంబాల వారు జీవనం సాగిస్తున్నారు. దీనిపై కోర్టుకు కూడా వెళ్లామన్నారు. ప్రస్తుత విచారణలో 50 ఏళ్లుగా . రైతులు సాగులో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారన్నారు. ఈ విషయమై తహశీల్దార్‌ను వివరణ కోరగా తన భూమిని జేపి.అగ్రహారానికి చెందిన వ్యక్తి ఆక్రమించుకున్నారని, ఆ భూమిని సర్వే చేసి తనకు ఇప్పించాలని వివి.నాగవర్మ జిల్లా పోలీసు అధికారుల ద్వారా లేఖ తేవడంతో ఆ భూమిపై విచారణ చేస్తున్నామన్నారు.

విశాఖ డెయిరీ ముట్టడికి తరలిరండి

ప్రజాశక్తి- మాడుగుల :తగ్గించిన ఆవు పాల సేకరణ ధర పెంపు, ఇతర సమస్యల పరిష్కారానికి సిపిఎం ఆధ్వర్యంలో వచ్చేనెల 2న విశాఖలోని విశాఖ డెయిరీ కార్యాలయం ముట్టడి ఆందోళనను జయప్రదం చేయాలని మాడుగుల మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఇరట నరసింహమూర్తి పిలుపునిచ్చారు. .శుక్రవారం మాడుగులలో విశాఖ డెయిరీ పాల రైతులతో పాల కేంద్రాల వద్ద కరపత్రాలు పంచుతూ పాలు క్యాన్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నెల 29న డెయిరీ వద్ద పెద్ద ఎత్తున ధర్నా జరపడంతోపాటు నాలుగు జిల్లాల్లో ఎమ్మెల్యేలకు, మంత్రులకు, జిల్లా కలెక్టర్లకు దరఖాస్తులు ఇచ్చిన నేపథ్యంలో అసెంబ్లీలో పెద్ద చర్చ జరిగిందని ,హౌస్ కమిటీ వేయడానికి ఎమ్మెల్యేల తీర్మానం

రైతులకు కరపత్రాలు పంచుతున్న సిపిఎం నాయకులు

చేశారన్నారు. అయితే డెయిరీ నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. డెయిరీ ముట్టడిలో పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. డోకల అప్పా రావు, పుట్ట వెంకటరమణ, పులిగ సంజీవి, యడ్ల. అప్పారావు, వేపాడ జగ్గారావు, జొన్నపల్లి శ్రీను పాల్గొన్నారు.

గుంతలు లేని రోడ్లే ప్రభుత్వ లక్ష్యం

శంకుస్థాపన చేస్తున్న హోంశాఖ మంత్రి అనిత

హోంశాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: రాష్ట్రంలో గుంతలు లేని రోడ్ల నిర్మించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం ఉదయం దార్లపూడి గ్రామంలో రూ.24.30 కోట్లతో రామచంద్రపురం నుండి అడ్డరోడ్డు వరకు సుమారు 13కిలోమీటర్ల రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడచిన వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే రోడ్లు అధ్వాన్నస్థితికి చేరాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రోడ్లను గుంతలు లేకుండా అభివృద్ధి చేయాలని సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిర్ణయం తీసుకున్నారని, దశలవారీగా అన్నీ పూర్తి చేస్తామన్నారు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, ఆర్ అండ్ బి అధికారులు, సర్పంచ్, జెడ్పీటిసి కాకర దేవి, మండల టిడిపి అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, మాజీ ఎంపిపి వినోద్ రాజు, నాయకులు నల్లపరాజు వెంకటరాజు జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, బోడపాటి శివదత్ పాల్గొన్నారు.

'ప్రజాశక్తి' కథనాలకు స్పందన

కోటవురట్ల : అడ్డురోడ్డు నర్సీపట్నం రహదారి అధ్వానస్థితిపై ఇటీవల ప్రజాశక్తిలో వచ్చిన వరుస కథనాలతో కూటమి ప్రభుత్వంలో స్పందన లభించింది, **'అనితమ్మ అడ్డ రోడ్డు వైపు చూడమ్మా', 'రహదారులు ఇలా.. వెళ్లేదెలా?'** అంటూ ప్రజాశక్తి లో వచ్చిన కథనాలకు కూటమి ప్రభుత్వంలోని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత స్పందించారు, అడ్డరోడ్డు నర్సీపట్నం రహదారి అభివృద్ధికి రూ.24 కోట్ల నిధులు విడుదల చేసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. గతంలో పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ తోపాటు ఎన్నికల హామీలో భాగంగా రోడ్డుకు నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు, కాగా ప్రజాశక్తి కథనాలతో ప్రభుత్వంలో కదలిక వచ్చి, అడ్డురోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టడంపై మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి- మాడుగుల : పెరుగుతున్న ఆర్థిక నేరాల నేపథ్యంలో మాడుగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ - సెక్యూరిటీ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సివిఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అవగాహన అప్రమత్తత కలిగి ఉండాలన్నారు. బ్యాంకు సిబ్బంది ఎప్పుడు ఖాతాదారుల అకౌంట్ వివరాలు గానీ, పిన్ నెంబర్ కానీ అడగరని, అలా ఎవరైనా అడిగినా చెప్పరాదని సూచించారు. స్థానిక న్యాయవాది శ్రీనాద్ ప్రసాద రావు మాట్లాడుతూ సైబర్ క్రైమ్ నేరాలు చట్టాలు శిక్షలు గురించి అవగాహన కల్పించారు.కళాశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుత న్యాయవాది జె. జగదీష్ ఇన్‌స్టెంట్ లోన్లు, ఈజీ మనీ, ఉద్యోగ అవకాశాల పేరిట జరుగుతున్న మోసాలను వివరించారు. డిజిటల్ అరెస్ట్, నేర సంఘటనలు, వాటి పర్యవసానాలు, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లలో అపరిచితులతో స్నేహాలు చేయడం మంచిది కాదని, వ్యక్తిగత వివరాలు ఫోటోలు షేర్ చేయడం వల్ల కలిగే అనర్థాలను సోదాహరణంగా వివరించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ మేనేజర్ సత్య వినయ్, మహిళా పోలీస్ కళ్యాణి, అధ్యాపకులు షర్మిలశ్రీ, ఆర్.వి.రమణమూర్తి, రాజు, నారాయణ, అప్పలనాయుడు, ప్రసాదరావు, నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రామ్ కుమార్ పాల్గొన్నారు

ఆసుపత్రుల్లో వైద్యసేవలపై అవగాహన

ప్రజాశక్తి - రావికమతం : మండలంలో చినపాచిల జెడ్‌పి హైస్కూలు విద్యార్థులు ఒకేషనల్ హెల్త్ కేర్ ఇండస్ట్రియల్ సందర్శనల్లో భాగంగా మండల కేంద్రంలోని జివిఎన్‌హెచ్ హస్పిటల్‌ను శుక్రవారం సందర్శించారు. జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ట్రైనర్ భవాని విద్యార్థులకు హాస్పిటల్లో పలు విభాగాలను చూపించి, వాటి పనితీరు, ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా హాస్పిటల్‌లో అవుట్ పేషెంట్ విభాగం, ల్యాబ్‌లలో పరీక్షలు, మందులు పంపిణీ, జనరల్ వార్డు సేవలు ఇలా పలు విభాగాలు, అక్కడి వైద్య సేవలను గురించి వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసన్ విద్యార్థులకువివరించారు. జిల్లా ఒకేషనల్ కోఆర్డినేటర్ కిషోర్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఇటువంటి క్షేత్రస్థాయిలో అవగాహన పొందడం వలన భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వేపాడ సత్యనారాయణ, రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ హాకీ టీం ఎంపిక

ప్రజాశక్తి-నక్కపల్లి : ఆంధ్రా యూనివర్సిటీ ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పురుషుల హాకీ టీం ఎంపికలు నక్కపల్లి హాకీ క్రీడామైదానంలో శుక్రవారం జరిగాయి. స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివయ్య, ఫిజికల్ డైరెక్టర్ కె.దుర్గా రావు ఆధ్వర్యంలో బియస్ హాకీ క్లబ్ పర్యవేక్షణలో జరిగిన ఈ పోటీలకు రిటైర్డ్ డిఎస్‌డిఒ. నగిరెడ్డి సూర్యారావు, ఆంధ్రా యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ ఎన్. విజయ మోహన్, ఆంధ్రా యూనివర్సిటీ ప్రధాన కార్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ ఎ. పల్లవి పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సెలక్షన్స్ లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు వచ్చేనెల 3 నుండి 8వ తేదీ వరకు చెన్నయ్ ఎంఆర్‌కె స్టేడియంలో జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ మెన్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా చెన్నయ్‌లో జరిగే పోటీలకు ఎంపికైన క్రీడాకారులను బియస్ హాకీ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, సెలక్షన్స్ కమిటీ సభ్యులు లక్ష్మణ్‌రెడ్డి, వెంకటేష్,కోచ్ రాంబాబు,కార్యదర్శి తాతాజీ, సీనియర్ జాతీయ క్రీడాకారుడు గాజులు రామచంద్ర రావు, కొల్నాటి నానాజీ.ఎస్.జి.ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. నాగేశ్వరరావు అభినందించారు.

పశుగణన సర్వే ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - చీడికాడ : మండలంలోని జైతవరం గ్రామంలో 21వ పశు గణన కార్యక్రమాన్ని శుక్రవారం మాడుగుల ఏరియా పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టి నాయుడు ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బందికి తగు సూచనలు చేశారు. పాడిరైతులు పశుసంపద వివరాలను సర్వే సిబ్బందికి తెలియజెప్పి సహకరించాలని కోరారు. గ్రామ పశువైద్య సహాయకులు మార్తా శ్రీనివాసరావు రైతులు పాల్గొన్నారు

మాడుగుల : మండలంలోని ఎం. కోటపాడు గ్రామంలో జరుగుతున్న 21వ పశు గణన కార్యక్రమాన్ని శుక్రవారం పాడేరు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ సి.హెచ్.నరసింహులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ పశుగణన కార్యక్రమం వచ్చే ఏడాది రెండో నెల 28వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాలలో జరుగుతుందని ప్రజలందరూ తమ వద్ద ఉన్న పశు సంపద వివరాలు పశు సంవర్ధక శాఖ సిబ్బందికి అందించి సహకరించాలని సూచించారు. ఇప్పటి వరకు మండలం లో 11 మంది ఎన్యుమరేటర్లు 4905 ఇళ్లను సర్వే చేశారన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

- రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత
- ప్రజా దర్బార్‌కు వెల్లువెత్తిన వినతులు

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రజా సమస్యలు పరిష్కరించడానికి అధికారులతో కలిసి ప్రజా దర్బార్ కార్యక్రమం చేపట్టామని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిశీలించి తక్షణం పరిష్కారం చేపడతామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. శుక్రవారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో కలిసి ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు ఇతర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున వచ్చిన ప్రజల నుంచి హోంశాఖ మంత్రి అనిత వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా స్వయంగా అర్జీదారుల సమస్యలను తెలుసుకుంటూ, వినతులను క్షుణంగా పరిశీలించి స్వీకరించారు. ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశించారు. పెద్ద సంఖ్యలో వికలాంగులు తరలిరావడంతో, ముందుగా వారి వద్దకు వెళ్లి అర్జీలను స్వీకరించారు. పెన్షన్లు, రేషన్ కార్డులు, గృహాలు మంజూరు చేయాలని, భూ సమస్యలు, భూ తగాదాలు, కుటుంబ తగాదాలు, శాంతి భద్రతల సమస్యలతో పాటు వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పలువురు వినతులు అందజేసారు. సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అనితకు వినతిపత్రం అందజేశారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాజయ్య పేటకు చెందిన మత్స్యకార నాయకులు వినతిపత్రం అందజేసారు. నక్కపల్లి జాతీయ రహదారిపై ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, ఉపమాక వెంకన్న జంక్షన్ వద్ద అత్యధికంగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నయని, సిగ్నల్ పాయింట్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. పాయకరావుపేట మండలంలో మంగవరం వెళ్లే మార్గంలో మూడు సెల్ టవర్లు ఏర్పాటు చేస్తున్నారని, దీనివల్ల ఆరోగ్యకరమైన ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉన్నందున నిలుపుదల చేయాలని కోరుతూ పలువురు మహిళలు వినతిపత్రం అందజేశారు. సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచిన గురుకులం విద్యార్థులను అభినందించారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ప్రజల నుండి వచ్చిన అర్జీలు రిజిస్టర్ చేసేందుకు స్టాల్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ వి.వి.రమణ, స్థానిక తహసీల్దార్ నరసింహమూర్తి, ఎంపిడిఒ సీతారామరాజు, పలు శాఖల అధికారులు,టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జనసేన రాష్ట్ర కార్యదర్శి శివదత్, గెడ్డం బుజ్జి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్, కొప్పిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత

కెడి.పేట పోలీసులకు ప్రశంసలు

ప్రశంసాపత్రాలతో కృష్ణదేవిపేట ఎస్ఐ, పోలీసులు

ప్రజాశక్తి-గొలుగొండ: అత్యంత చాకచక్యంగా గంజాయి అక్రమ రవాణాకు పాల్పడిన నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు, భీమవరం చెక్ పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం ప్రశంసాపత్రాలను అందజేశారు. గురువారం అల్లూరి పార్కు వద్ద కర్ణాటకకు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో అక్రమంగా తరలిస్తున్న 25 కేజీల గంజాయితో పాటు రూ.11లక్షల 6వేల నగదు, ఒక కారు, మూడు సెల్ ఫోన్లు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఈ కేసును ఎంతో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్ఐ తారకేశ్వరరావుతో పాటు సిబ్బంది కె.విశ్వేశ్వరరావు, కె.ఆంజనేయులు, ఎవివి. అప్పారావు, కె..చిరంజీవి, ఎ.వి.సతీష్, పి.గోవిందరావు, కెజె.నాయుడులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

పివిజి కుమార్‌కు అభినందన

ప్రజాశక్తి- మాడుగుల : రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్‌ను శుక్రవారం ఆయన నివాసంలో మాడుగుల మండల జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మండల ఉపాధ్యక్షుడు దయా యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి దాసరి అచ్చుతారావు, గుమ్మాల అప్పలనాయుడు, అజిత్ కుమార్, దండి రమణ ఉన్నారు.

జిల్లా స్థాయి కౌశల్ పోటీలకు జోగంపేట విద్యార్థులు

ప్రజాశక్తి-గొలుగొండ : కౌశల్ జిల్లాస్థాయి సైన్స్ ప్రతిభా పోటీలు-2024లకు గొలుగొండ మండలం జోగంపేట జెడ్‌పి ఉన్నత పాఠశాల నుండి 14మంది విద్యార్థులు ఎంపికయ్యారని స్కూల్ కోఆర్డినేటర్ ఎం.భాను చందర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం కుమారి, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూలు స్థాయిలో జరిగిన కౌశల్ ప్రతిభ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు రాణించారన్నారు. జిల్లా స్థాయిలో కూడా ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంపి శ్రీనివాసరావు, బి.అప్పారావు, కె.బాబూరావు, ఎన్.చిరంజీవి పాల్గొన్నారు.

సిపిఎం ఏరియా కమిటీ కార్యవర్గం

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండలంలో పెద్ద గుమ్ములూరు గ్రామం శివాలయం దరి బొమ్మ పాకలో సిపిఎం ఎస్ రాయవరం, కోటవురట్ల ఏరియా కమిటీ సమావేశం నిర్వహించారు. ముందుగా సిపిఎం జెండాను జి.డేవిడ్ రాజు ఎగరవేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి. వెంకన్న పర్యవేక్షణలో ఆరుగురు సభ్యులతో కూడిన నూతన ఏరియా కమిటీని ఎన్నుకున్నారు. కోటవురట్ల, ఎస్. రాయవరం ఏరియా కార్యదర్శిగా మోర్త సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో అడ్డురోడ్డులో ఆర్‌టిసి కాంప్లెక్స్, సులబ్ సౌచాలయ ఏర్పాటు చెయ్యాలని, అడ్డురోడ్డ నుండి గొట్టివాడ వరకు నర్సీపట్నం వెళ్లే రోడ్డు బాగుచేయాలని, అణుకు తారురోడ్డ వెయ్యాలని తీర్మానించారు. సమావేశంలో డి.వెంకన్న మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వెంటనే ఆపాలని, పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం. రాజేష్, చిన్నిమ్మి, సూరిబాబు, వాసపల్లి అప్పన్న, మామిడి నానాజీ, చేపల పోలీసు పాల్గొన్నారు.

మోర్త సత్యనారాయణ

ఘనంగా క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పో ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని ఎంవిపి.కాలనీ గాది రాజు ప్యాలస్ వేదికగా నిర్వహిస్తున్న క్రెడాయ్ 10వ ఎడిషన్ ప్రాపర్టీ ఎక్స్‌పోను శుక్రవారం ఉదయం మాజీ మంత్రి, ప్రస్తుత భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభకు ముఖ్య అతిథులుగా విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఫిబ్రవరి నుంచి రియల్ ఎస్టేట్ బూమ్ పెరుగుతుందని, నగరానికి ఎయిర్‌పోర్టు కనెక్టివిటీ రోడ్, మెట్రో.. ఇలా అన్నీ వస్తున్నాయని, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ బిల్డర్స్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. విష్ణు కుమార్ రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బిల్డర్స్‌కు అండగా ఉంటుందన్నారు. 2026 జూన్‌కు భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తుందని, స్టీల్‌ప్లాంట్ నుంచి భోగాపురం వరకు మెట్రోతో పాటు దానికి అనుగుణంగా ఫ్లై ఓవర్లు నిర్మిస్తామని చెప్పారు. వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ రాష్ట్రం ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోందన్నారు. ఇసుకను అందరికీ అందుబాటులోకి తెచ్చామన్నారు. విశాఖపట్నం క్రెడాయ్ అధ్యక్షులు కెఎస్ఆర్‌కె.రాజు (సాయి) మాట్లాడుతూ నేటి నుండి మూడు రోజుల పాటు సాగనున్న ఈ ప్రాపర్టీ ఎక్స్‌పోలో సుమారు 71కి పైగా ప్రముఖ నిర్మాణ రంగ సంస్థలు పాల్గొని తమ వ్యాపార కార్యకలాపాలను వినియోగదారులకు ప్రదర్శిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, యుబిఐ, ఎల్ఐసి, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, ఐడిఎ తదితర జాతీయ బ్యాంకులు, 7 ప్రముఖ స్టీల్ కంపెనీలు, 35 ఇంటీరియర్ అండ్ ఎక్స్‌టీరియర్ కంపెనీలు కూడా పాల్గొంటాయని తెలిపారు. ప్రతి గంటకు ఒక ఒక గ్రాము, ప్రతి రోజు 5 గ్రాముల బంగారు నాణేలను ఇస్తున్నామన్నారు. మెగా బహుమతిగా ఒక హోండా యాక్టివా వాహనాన్ని వినియోగదారులకు అందిస్తున్నామన్నారు. అనంతరం ప్రతి ఏటా ఇచ్చే కె.సుబ్బరాజు మెమోరియల్ అవార్డులను సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన దాడి ప్రశాంత్, మంగ జయలక్ష్మి, తర్ల కుసుమ శ్రీలకు అతిథుల చేతుల మీదుగా అందించారు. ఈ ఎక్స్‌పోలో వీఎంఆర్‌డిఎ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ఎక్స్‌పో కన్వీనర్ సిహెచ్.గోవిందరాజు, క్రెడాయ్ విశాఖపట్నం ఛైర్మన్ బాయన శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వి.ధర్మేంద్ర, వి. శ్రీను, గౌరవ కార్యదర్శి ఇ.అశోక్ కుమార్, వీఎంఆర్‌డిఎ జాయింట్ కమిషనర్ రవీంద్ర పాల్గొన్నారు.

క్రెడాయ్ ప్రాపర్టీ షో ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు, అతిథులు

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన భూమాత స్టాల్

ఎక్స్‌పోలో భూమాత స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, చిత్రంలో తాళ్లూరి శివాజీ తదితరులు

క్రెడాయ్ ప్రాపర్టీ ఎక్స్‌పోలో భూమాత రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా భూమాతా రియల్ ఎస్టేట్ సంస్థ డైరెక్టర్ తాళ్లూరి శివాజీ మాట్లాడుతూ సామాన్యుడు ఇల్లు లేదా ఓపెన్ ప్లాట్‌ను సొంతం చేసుకోవాలంటే భూమాత గ్రూపును సంప్రదించాలని, తమ వద్ద విశాఖపట్నం లోనే అతి తక్కువ ధరలకు ఇళ్లను, ఇంటి స్థలాలను అందిస్తున్నామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలలో సామాన్య మానవులకు అందుబాటులో ఉన్న ధరలలో ఇళ్లను, ఇంటి స్థలాలను ఇచ్చేటువంటి సంస్థ భూమాత మాత్రమేనని చెప్పారు. 26 సంవత్సరాలుగా వేల మందికి తమ సేవలు అందించామన్నారు. క్రెడాయి ప్రాపర్టీ షోలో కచ్చితంగా కస్టమర్లందరికీ పలు రకాల రాయితీలు ఇవ్వనున్నామని, వాటిని అందరూ వినియోగించు కోవాలని కోరారు. ప్రాపర్టీ షోను సందర్శించి భూమాత గ్రూపులో ఒక ఇంటి స్థలాన్నిగానీ, ఇంటినిగానీ లేదా విల్లాస్‌గాని కొనుగోలు చేసి తమ గ్రూపులో అందరూ భాగస్వాములు కావాలన్నారు